స్వచ్ఛమైన చిరునవ్వుకి... అచ్చమైన చిరునామా...

హాస్యానందం

సంపూర్ణహాస్య మాస పత్రిక

జులై-2013

₹15/-

జూలై ప్రత్యేక సంచిక




వెల కట్టలేని మీ ఆనందానికి 15 రూపాయలు ఓ లెక్కేనంటారా?


బాలి వర్ణ చిత్రాలు





బాలి వర్ణ చిత్రాలు





స్వచ్ఛమైన చిరునవ్వుకి... అచ్చమైన చిరునామా...

హాస్యానందం

సంపూర్ణహాస్య మాస పత్రిక

జులై-2013

Publisher&Editor	:	Ramu.P
Associate Editor	:	Sudharani.P
Cartoon Editor	:	A.V.M
Well Wishers	:	Tanikella Bharani Jaydev Mallik
Full Pillar	:	Bnim
Designing	:	Creative Graphix
Creative Team	:	Tumbali Sivaji T.Chandra Sekhar Rampa Surya Dubey P.V.Narayana Ramsheshu P.Priyatham Mallikarjun.U
Helper	:	Raviteja.S
Address	:	HASYANANDAM, #8-215/4, Near Ramalayam, Po:YERRABALEM Pin 522 503, Mangalagiri Mandal, Guntur dist.
Ph	:	9849630637

email: hasyanandam @yahoo.com

Hyderabad & Telangana Marketing	:	Charminar News Agency, 1-6-176/1, M.G.Road, Khandoji Bazar, Secunderabad-3. Ph:9346515813
And	:	Shams News Agency, Abids, Hyderabad. Ph:040-30680840/41



హాయ్... సానందంగా...

హాస్యానందం ఆప్తులకు,అభిమానులకు...
హాస్యాభివందనాలు.

హాస్యానందం మన చిత్రకారుల... కార్టూనిస్ట్‌ల ప్రత్యేక సంచికలు రూపొందించి ఇతర పత్రికలకూ మార్గ దర్శకం కావడం ముదావహం.
ఈ సత్సంప్రదాయంలో ఈ సంచిక మన సుప్రసిద్ధ చిత్రకారులు, కార్టూనిస్ట్ అయిన బాలిగారి ప్రత్యేక సంచికగా రూపొందించాం!

కార్టూన్‌కి ఐడియా ప్రాణం అయితే ఎక్స్‌ప్రెషన్ శరీరం! ఎంత గొప్ప ఐడియా అయినా దాని చిత్రీకరణ ఎంత బాగున్నా... ఐడియాలో స్పార్క్ లేకపోతే పేల వంగా ఉండిపోతుంది. ఈ రెండింటిని సమన్వయం చేసుకుని అద్భుతమయిన కార్టూన్లు వేసిన మన బాలిగారు... కథకు బొమ్మ వేసే పద్ధతి కూడా అందరికంటే డిఫరెంట్‌గా ఉంటుంది. ఈనాటికీ ఆయన బొమ్మలు వేస్తున్న తీరు చూస్తే అందుకే బాలి ఇంత గొప్ప ఆర్టిస్ట్‌గా మన్ననలందుకుంటున్నారు అన్పిస్తుంది.

శ్రీబాలిగారికి ఈ మధ్యనే ప్రభుత్వం 'హంస' అవార్డు ఇచ్చి సత్కరించింది. ఆయన ప్రతిభకు ఇది చాలా చిన్న అవార్డు. ప్రభుత్వ ఉద్యోగం కాదని(వదిలేసి) చిత్రకళ మీద మమకారంతో ఈ రంగంలో ఎంతో కష్టపడి ఒక బొమ్మని చూడగానే ఇది బాలి బొమ్మ అనుకునే స్థాయికెళ్ళిన మన బాలిగారిని హాస్యానందం మనసారా అభినందిస్తూ.... ముమ్ముందు అద్భుతమైన చిత్రాలు ఈయన కుంచే నుంచి జాలువారాలని కోరుకుంటోంది.

-రాము.పి
(ఎడిటర్)

ఎక్కడ ఏ నవ్వులున్నాయో....

మన జనాలు

Bali



ఆ టాపిక్! -ఈ కార్టూన్

Jayadev

ఎవరైనా బుద్ధి తక్కువ పని చేస్తే అందువల్ల మనకి అసౌకర్యం కలిగితే- "ఏమయ్యా!... నీకేమైనా సెన్సుందా!" అని మందలిస్తాం... విసుక్కుంటాం... అవతలి వాడిని 'సెన్స్‌లెస్‌ఫెలో'గా' పరిగణిస్తాం!

ఎవర్నైనా మనం అభినందిస్తున్నప్పుడు- "అతడెంత 'సెన్సిబుల్'గా మాట్లాడతాడో చూశా వా?" అని పొగుడుతాం!"

'సెన్స్' అంటే బుద్ధి అని... 'సెన్సెస్' అంటే ఇంద్రియపరమైన జ్ఞానమని... బడిలో చదివి తెలుసుకున్నాం.

'సెన్స్'కి వ్యతిరేక పదం 'నాన్ సెన్స్'.

అర్థం పర్థం లేని విషయాలూ, పనులూ చొప్పదంటు వాక్యాలూ, మాటలూ 'అబ్సల్యూట్ నాన్ సెన్స్' కింద లెక్క!


ఏదైనా మామూలుకి, భిన్నంగా వుండేదానిపైన మన దృష్టిపడటం సహజం. కార్టూనిస్ట్ సాధారణంగా అలాంటి భిన్నమైన సబ్జెక్టులని ఎన్నుకుని, కార్టూన్లను గీసి పాఠకుల దృష్టినాకర్షిస్తాడు. అటువంటి కార్టూన్లలో కొన్ని అర్థం పర్థం లేనివి కొల్లలు కొల్లలుగా ఉన్నాయి. వాటిని 'నాన్‌సెన్స్' కార్టూన్లు అంటారు.

అవి నాన్‌సెన్స్ కార్టూన్లే అయినా, వాటిని నిశితంగా పరిశీలిస్తే, ఏదో ఒక సందేశం మనకి అవగతమవుతుంది.

కార్టూనిస్ట్ పాఠకుడ్ని ఆలోచింపజేసి, కార్టూన్ భావాన్ని వైవిధ్యంగా వ్యక్తం చేస్తాడు.

అటువంటి కార్టూనే ఇది. దీని సందేశం- 'మితంగా తినాలి... వేస్ట్ చేయకూడదు.

-జయదేవ్





చిత్ర విచిత్ర రేఖ రచనలో హిమశైలి
అసమాన రేఖాచిత్ర ప్రతిభాశాలి
చిత్ర కళారంగాన నిత్య'న్యూ'తన శైలి
అరుదైన చిత్రకారుడు మన 'బాలి'
రాత: బి.ఎమ్.పి.సింగ్

గీత: శంకర్ నారాయణ ✦ రాత: బి.ఎమ్.పి.సింగ్



గత ఐదేళ్ళుగా
ప్రముఖ కార్టూనిస్ట్
లేపాక్షి గారిచే నడపబడుతున్న
సంపూర్ణ హాస్య వెబ్‌సైట్
చమత్కారం.కామ్‌లో
www.chamatkaram.com

మన సంపూర్ణ
హాస్య మాస పత్రిక హాస్యానందం
'ఈ'బుక్ సంపూర్ణంగా దొరుకుతోంది.
మీరు చేయవలసినదల్లా....
www.chamatkaram.com క్లిక్ చేయడమే!

శుభాకాంక్షలు



హాస్యానందం'కి
అత్యంత ఆప్తులు శ్రేయోభిలాషులు
శ్రీ తనికెళ్ళ భరణి గారికి
జన్మదిన శుభాకాంక్షలు!



హాస్యానందం పాఠకులకు సుపరిచితులు ప్రముఖ రచయిత, కార్టూనిస్ట్ **శ్రీ పార్నంది రామశర్మగారు,** విశాఖపట్టణం-BSNL లో Divisional Engineer గా పని చేసి ఈ నెల అంటే జులై 30న ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా.... ఈ కొత్త మజిలిలో రామశర్మగారు మంచి వ్యాపకాలతో... ఆరోగ్యంగా... ఆనందంగా కాలం గడపాలనీ హాస్యానందం మనసారా కోరుకుంటూ **శుభాకాంక్షలందజేస్తోంది.**

హాస్య కథలకు స్వాగతం

తెలుగు కథ 100 సంవత్సరాలు పూర్తిచేసుకున్న శుభ సందర్భంగా కర్నూలు తెలుగు హాస్యకళా సమితివారు ఉత్తమ హాస్య కథలను మూడు సంపుటాలుగా వెలువరించడానికి సంకల్పించారు. 2010, 2011, 2012 సంవత్సరాల కాలంలో పత్రికల్లో అచ్చయిన మీ హాస్య కథలను ఈ కథా సంపుటికి పంపవచ్చు. ప్రఖ్యాత చిత్రకారుడు బాపు ముఖచిత్రంతో త్వరలో వెలువడే ఈ కథా సంపుటికి మీ కథతోపాటు మీ పాస్‌పోర్టు కలర్ ఫోటో, బయోడేటా రాసి రెండు కాపీలను జులై 15వ తేదీలోగా ఈ క్రింద వున్న ఏదో ఒక చిరునామాకు పంపవచ్చు. పాల్గొన్న రచయితల కలర్ ఫోటోలు ఈ సంపుటిలో ప్రచురించబడును.

ఎ.వి.మోహనగుప్తా, *(ఏవిఎమ్-కార్టూనిస్టు) 23-26-1/ఎ, సుమాణం వారి వీధి, సత్యనారాయణపురం, విజయవాడ-520 011.*
మొబైల్ : 98494 42868. email : usalapati@yahoo.com
వియోగి, *W/o.టి.కె.విశాలాక్షి, 87/395, కమలానగర్, బి.క్యాంపు, కర్నూలు-518 002. మొబైల్ : 99639 26610*

రీ సౌండ్.....

హాస్యానందం జూన్ సంచికలో ప్రచురించిన తెలుగు కార్టూనిస్ట్‌ల దినోత్సవం వివరాలు చాలా బావున్నాయి. మన కార్టూనిస్ట్‌లకు మీరు ఇస్తున్న ప్రాముఖ్యం ఆనందకరమైన విషయం. మన తొలి తెలుగు కార్టూనిస్ట్ శ్రీతలిశెట్టి రామా రావు జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి మహామహులు రావటం చాలా గొప్ప విషయం. వచ్చే సంవత్సరం కూడా ఈ పండుగ మనోహరంగా జరగాలని కోరుకుంటూ... మేము కూడా ఆ సభకు రావాలని ప్లాన్ చేసుకుంటున్నాం.

-ఎస్.రవికుమార్, విశాఖపట్టణం

హాస్యంతో ఆనందాన్ని పంచుతున్న మా అభిమాన పత్రిక హాస్యానందంకు ముందుగా మా అభినందనలు. జూన్ సంచికలో ప్రచురించిన కథలు, కార్టూన్లు చాలా బాగున్నాయి. కార్టూన్లు నీట్‌గా మీరు ప్రజెంట్ చేస్తున్న తీరు ప్రశంసనీయం. కథలకు బొమ్మలు కూడా చాలా బాగుంటున్నాయి. మే 20న హైదరాబాద్‌లో జరిగిన 'తెలుగు కార్టూనిస్ట్‌ల దినోత్సవం సభకు నేనూ హాజరయ్యాను. ఆ సభ గొప్ప అనుభూతిని మిగిల్చింది.
థ్యాంక్స్ టు హాస్యానందం!

-బి.హరికృష్ణ,హైదరాబాద్


హాస్యానందం జూన్ సంచిక ముఖచిత్రం రమ్యంగా ఉంది. ఈ సంచికలో ప్రారంభమయిన హాస్యచంద్ర001 సీరియల్ ఓపెనింగ్ సినిమా చూస్తున్న అనుభూతి కలిగించింది. రచయితకు మా అభినందనలు. ఇందులో ప్రచురించిన కథల్లో మల్లిక్ 'సినిమాకో కథ కావాలి' కథ జరుగుతున్న సంఘటనల్ని కళ్ళకు కట్టినట్లు చదివిస్తూ... నవ్వించాయి. ఈ రెండింటిని బ్యాలెన్స్ చేసిన మల్లిక్ నిజంగా గ్రేట్!... అందుకే ఆయన ఎవర్‌గ్రీన్ రైటర్ అయ్యారు. కార్టూన్లు బావున్నాయి. అయితే కొన్ని కార్టూన్లు అక్షరదోషాలతో ప్రచురించబడింది. పత్రికని మీరు తీర్చిదిద్దుతున్న తీరు అభినందనీయం. **-జి.భార్గవి,రాజమండ్రి**

కొంటె ప్రశ్నలు- తుంటరి జవాబులు



ప్రముఖ హాస్య నటులు

సుదర్శనం



✦ కవిత్వం రాయడం... చెప్పడం మానేసారా?

రాయడం మా ఆవిడ మాన్పించింది... చెప్పడం చుట్టుపక్కల వాళ్ళు మాన్పించేసారు.
మొదటిది 'వుమెన్ హ్యాండ్లింగ్'... రెండోది-'మెన్ హ్యాండ్లింగ్!'



✦ పరిశ్రమలో 'గ్రూప్'లున్నాయా?

మనిషి 'బ్లడ్'లో ఉంది. ఏమైనా అది పాలి'ట్రిక్స్' కే చెల్లు



✦ ఆడ ఫ్యాన్స్ ఉన్నారా?

ఏడా...? అది 'షీ'క్రేట్!



✦ మీకు 'ఫ'లాన వ్యక్తితో 'ఫ'డదటా!

మా మధ్య 'ఒత్తులు' 'ఫె'ట్టకండి!
ఏదో ఫన్నీగా అడిగంలెండి!
అదే పనిగా అడగలేదు సంతోషం!

✦ సినీ రంగంలో మనుషుల్ని అర్థం చేసుకోవడం కష్టమా?

అపార్థం చేసుకోకుండా చూసుకోవడం ఇంకా కష్టం!... ఏ రంగమైనా!






✦ దాంపత్యంలో భర్తకుండాల్సిన గొప్ప లక్షణాలు?

ఇచ్చిన మాట నిలబెట్టుకునే 'నిజాయితీ!' మాటివ్వకూడదనే 'తెలివి!'





✦ మంచివాడు అన్పించుకోవాలనుందా?... గొప్పవాడు అన్పించుకోవాలనుందా?

మంచి గొప్పవాడు!

Cartoons: Hari

నిశితపరిశీలనా శక్తిగల మేధావి శ్రీ బాలిగారు.

-పద్మశ్రీ డా॥ఎస్.వి.రామారావు, న్యూఢిల్లీ

ఆంధ్రప్రదేశ్‌లో ఎంతోమంది ప్రసిద్ధ చిత్ర, శిల్పకారులు ఉన్నారు. అంతకంటే ఎక్కువగానే సంఖ్యలో అద్భుతమైన కార్టూన్లను చిత్రించేవారు ఉన్నారు. తెలుగువారు ఆదరిస్తున్నారు. ఆనందిస్తున్నారు.

చిత్రకళలో భాగమే కార్టూను కళ. అయినా దీన్ని అందరూ వేయలేరు. ఎంత గొప్ప చిత్రకారుడైనా సరే. ఒక రకపు విశిష్టమైన భావ సంపద, మానవుని జీవన మనుగడలో అనుభవించే కష్టసుఖాలు, రాజకీయ పరిజ్ఞానం, సూటిగా, ధైర్యంగా చెప్పే ధైర్య సాహసాలు కావాలి కార్టూనిస్ట్‌కు.

ఇతర్లను ఆలోచింప చేసి హాస్యంలో ముంచెత్తేది కార్టూను కళ.

కార్టూనులు చిత్రించడానికి... అందులో రాణించడానికి... చిత్రకళా రంగంలో ముఖ్యంగా డ్రాయింగ్‌లో కొంత కృషి పెట్టడం అవసర మవుతుంది. నిజానికి తప్పనిసరేనని అనుకోవలసి వస్తుంది. అప్పుడు గీసే రేఖలలో జీవం ఉంటుంది. సాంఘికపరమైన కార్టూన్లను ప్రజల్ని వారి అభిమతాల్ని, నమ్మకాలను, అలవాట్లను గ్రహించడం ముఖ్యం.

ఇంతకూ నేను చెప్పదలచుకున్నది ఏమిటంటే చిత్రకారుని కంటే కార్టూనిస్టుకి నిశిత పరిశీలన చేసే అవగాహనకు కావలసిన మేధస్సు ఉండి తీరాలి అని. ఇది లేనిదే ఈ కళలో రాణించడం కష్టం.

ఎన్నో సంవత్సరాల అనుభవము, జర్నలిజంలో అవగాహన, పరిపూర్ణ రచయిత, నిశితపరిశీలనా శక్తిగల మేధావి శ్రీ బాలిగారు.

వారి చిత్రాల్లోని బలమైన రేఖలు చాలా హాయిగా, వయ్యారంగా ప్రవహిస్తున్న నదుల్లా ఉంటాయి. ముఖ్యంగా ప్రస్ఫుటంగా కన్పించేది వారు గీసిన మానవ ఆకారాల్లోని ప్రపోర్షన్. అది సాధించడానికి ఎన్నో సంవత్సరాల కృషి ఉండాలి. అందరికీ సాధ్యపడేది, వచ్చేది కాదు సులువుగా.

పత్రికల్లో ప్రచురింపబడే రచనకు క్షుణ్ణంగా చదివి ఏ సన్నివేశానికి రేఖా చిత్రం వేయాలో ఆయనకు బాగా తెలుసు. ముదోంతులుగా, ఒక్కొక్కసారి సగం పేజీగా ఆక్రమిస్తాయి వారి రేఖా చిత్రాలు.

ప్రతి మనిషి ముఖంలోని హావ భావాలు, మనుషులు కూర్చున్న తీరు, నిలబడ్డ తీవీ, వేసుకున్న బట్టలు గాలిలో రెపరెపలాడే సొగసు వారి రేఖా చిత్రాల్లో కనిపిస్తాయి.

శ్రీ బాలిగార్ని అమెరికా నగరంలోని చికాగో వారంతా అక్కడ జరిగే 'తానా' సభలకు అహ్వానించారు. వారు తనవెంట చాలా కార్టూన్లను తీసుకువచ్చారు.వాటినన్నిటినీ చిత్రకళా ప్రదర్శనలో ఉంచాం.

వాటిలో చురకలు వేసిన కార్టూన్లు, రాజకీయమైన కార్టూన్లు ఉన్నాయి. తన జీవితాన్ని కళాసాధనకు అర్పించుకున్న వ్యక్తిగా కనిపిస్తారు బాలిగారు కార్టూన్లను చూసే వారికి.

శ్రీ బాలిగారు సునిశిత మనస్కులు. నెమ్మదిగా, హుందాగా, ఎదుటి వానికి అర్థం అయ్యేట్టుగా చెప్పే తీరు ఆయనిది. ఎవరైనా మాట్లాడుతుంటుంటే శ్రద్ధగావినడం ఆయన లక్షణం.


ఆయన రేఖా చిత్రాలు నన్ను ముగ్ధుడను చేస్తాయి. వారి కార్టూన్లు నన్ను నవ్విస్తాయి-ఆలోచింపచేస్తాయి. అందర్ని అలానే చేస్తాయని నమ్ముతాను.

నాలానే అందరికి శ్రీ బాలి గారంటే ఎనలేని ప్రేమ, గౌరవాలు ఉన్నాయని భావిస్తాను.

ఇంకా ఎన్నో సంవత్సరాలుగా, తన రచనలతో, రేఖా చిత్రాలతో, కార్టూన్లతో తెలుగు సాహితీ రంగానికి, జర్నలిజానికి సేవ చేస్తుండాలని ఆశిస్తున్నాను.





డాక్టరూ... రోగీ


ఊఁ చెప్పండి! మీ బాధేమిటో...
బతకడమే బాధగా ఉంది - చచ్చిపోవాలని ఉంది. ఆఖరి ప్రయత్నంగా మీ దగ్గరికొచ్చాను


సుబ్బారావు మీ తర్వాత ప్రమోషన్ లిస్ట్‌లో ఉన్నాడు ఏమోనని?
ఆయన కెలా ఉందీ అంటూ
మాటిమాటికీ
ఫోను చేస్తున్నాడు


మీరు చాలా నయం!
దోమలు కుట్టి ఊరినిండా.... అదేమిటున్నట్లు...
డెంగూ రోగంతో చస్తున్నారు


ఏదో ఓ వేలుపట్టుకో...
నీకొచ్చిన
రోగమేమిటో
ఇట్టే చెప్తాను


WARD 5
ఇంకా
మీ ఆవిడకు
డెలివరీ
కాలేదు సారూ!



విగ్రహాలు పెట్టేసుకుందాం రండి!

కథ

ఎమ్.వి.జె.భువనేశ్వరరావు

గజదొంగ గంగులుజేబుదొంగ జగ్గును వెంటేసుకుని వీధిగుండా నడుస్తున్నాడు.

తన అనుభవంతో తెలుసుకున్న చోరకళ మెళుకువల్ని ఆలవోకగా చెప్పుకుంటూ పోతున్నాడు గంగులు. శ్రద్ధగా వింటూ, మధ్య మధ్యలో సందేహాల్ని నివృత్తి చేసుకుంటున్నాడు జగ్గు.

జగ్గూ నుండి ఏమీ ఆశించకుండానే - విశేషాలన్నీ తమాషాగా నేర్పేస్తున్నాడు గంగులు. ఎందుకంటే జగ్గూ - గంగులుకు స్వయానా కొడుకు కాబట్టి.

అర్థరాత్రి దాటి అరగంట అవడంతో జన సంచారం దాదాపుగా లేదు.

"నాన్నా!... ఈ రోడ్డు బాగా చిన్నది కదా! పది అడుగుల వెడల్పున్న ఈ ఇరుకు రోడ్డులో ఇరవై అడుగుల ఎత్తున్న ఈ విగ్రహం ఎవరిదని పెట్టేశారు? ఎప్పుడైనా తప్పించుకునే ప్రయత్నంలో పరిగెత్తినప్పుడు ఇలాంటి చోట్లే దొరికిపోతాం కదా?"

"అలా అనకు నాన్నా... ఈ విగ్రహం ఓ ముఖ్యమంత్రిగా పని చేసిన వ్యక్తిది ... ఆయన సేవలు మరచిపోకుండా ఇలా విగ్రహం స్థాపించారు.

గంగులు మాటలు అర్థమయ్యాయో లేదో మరింత ముందుకు నడవసాగాడు జగ్గూ.

"అరే మరో విగ్రహం ఉంది.... ట్రాఫిక్ ఐలెండ్‌లో పోలీస్ నిలబడే స్థానంలో ఏకంగా విగ్రహం పెట్టేశారు... ఇదెవరిది నాన్నా?"

"మరీ అలా అడగకురా కన్నా... ఇది మరొక ముఖ్యమంత్రిగా పని చేసిన వ్యక్తిది. వారిపై గౌరవంతో ఏర్పాటు చేసింది కదా. హేళనగా అడక్కూడదు."

జగ్గూ అదేమీ విన్పించుకోనట్లుగా ఉండిపోయాడు.

మరింత దూరం ముందుకు నడిచారు.


"అరే నాన్నా! ఇదెవరి విగ్రహం? పట్టి తల కాయ వుంది... మరీ రెండడుగులు కూడా ఎత్తు లేదు."

జగ్గూ మరీ పెద్ద వయసున్న వాడు కాదు... పన్నెండేళ్ళుంటాయి సుమారుగా.

కొంచెంసేపు గంగులుకు ఏమీ మాట్లాడాలో అర్థం కాలేదు.

"అయ్యో! ... ఆయనెవరో కూడా తెలీదా! మన దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహానుభావుడు... మహాత్మా గాంధీ. ఆయన మన జాతిపిత.... ఆయన లేకపోతే మన దేశమే లేదు."

"ఛ!... నిజమా .... అలా అయితే ఆయన విగ్రహం మరీ అంత బుల్లి సైజులో ఉందేం? వీళ్ళందరి కన్నా ఆయనదే పెద్దదిగా ఉండాలి కదా?" ఎదురు ప్రశ్నించాడు జగ్గూ.



"నిజమేననుకో... అయినా వేరేచోట ఆయనది కూడా పెద్ద విగ్రహం ఉందిలే." చెప్తూ ముందుకు అడుగు వేశాడు గంగులు. నాలుగడుగులు వేశాడో లేదో ... మరలా జగ్గూ గట్టిగా అరిచాడు.

"భలే భలే... ఈ విగ్రహం చూడు నాన్నా ఎంతెత్తుందో! దాదాపుగా ఏభై అడుగులుండి ఉంటుంది. ఈయన ఆ గాంధీ గారి కన్నా పెద్దోడయి ఉంటాడు కదా?" చాలా విషయాలు తెలిసిపోయినట్లు చెప్పాడు జగ్గూ.

గంగులుకు బాగా కోపం వచ్చింది.

"అలా మాట్లాడకు... ఆయనకీ ఈయనకీ పోలికేంటి? ఆయనేమో గాంధీ ... ఈయనేమో 'బ్రాంది' అమ్ముకునే లిక్కర్ కింగ్ దయాళ్. ఆయన విగ్రహాన్ని పేద ప్రజలు అభిమానంతో ప్రతిష్ఠించుకున్నారు... ఈయనేమో సారా వ్యాపారం చేసి, పేద ప్రజలచే త్రాగించి, వారి జీవితాల్ని నాశనం చేసి, వారి కష్టాన్ని దోచుకోగా వచ్చిన సొమ్ముతో స్వంతంగా విగ్రహం కట్టించుకున్నాడు... ఆయననేమి అనక పోయినా ఫరవాలేదు. ఈయనని పెద్ద విగ్రహం ఉందని చెప్పి, గొప్పోడనుకుంటే మాత్రం నేనొప్పుకోను."

జగ్గూకి అదంతా విన్నాక మెదడులో ఏదో ఆలోచన ఏదో 'ఫ్లాష్'లా మెరిసింది.

"అయితే నాన్నా!... డబ్బుంటే ఎవరి విగ్రహం వాళ్ళు ఎక్కడపడితే అక్కడ ప్రతిష్ఠించేసుకోవచ్చా?"

"ఎందుకు పెట్టుకోకూడదు?.. వాళ్ళు గొప్ప వాళ్ళయి వుంటే ఖచ్చితంగా పెట్టేసుకోవచ్చు."

"సారా వ్యాపారం చేసి, ప్రజల జీవితాల్ని బుగ్గిపాలు చేసిన వాళ్ళు గొప్పవాళ్ళవుతారా?" తిరిగి ప్రశ్నించాడు జగ్గూ.

"ఏమో అదేమీ నాకు తెలీదు... వాళ్ళూ ఏదో గొప్ప సేవ చేసుంటార్లే...!" సర్దిచెప్పాడు గంగులు.

"అదేమీ నాకు తెలీదు!... నేను సంపాదించిన డబ్బు తోనూ... నువ్వు సంపాదించిన డబ్బుతోనూ ఊరంతా నీ విగ్రహాలు పెట్టేస్తాను నాన్నా!"

"నా విగ్రహాలా?! నీకేం పిచ్చి పట్టలేదు కదా?"

"వాళ్ళిలా పెట్టారో నేనూ అలాగే పెడతాను... వాళ్ళు స్వంత డబ్బుతో పెట్టుకుంటే నేనూ స్వంత డబ్బు ఖర్చు చేసి పెట్టిస్తాను."

"అలా ఒప్పుకోరు నాన్నా... మనల్ని అదోలా చూస్తారు"

"వాళ్ళు ఒప్పుకోకుంటే ... జంక్షన్‌లలో స్థలాలు కొనైనా నేను నీ విగ్రహాలు పెట్టిస్తా నాన్న... ఇదే నా ప్రతిజ్ఞ".

గంగులు వద్దని వాదించాడు. చేతులు పట్టుకుని బ్రతిమ లాడాడు... అయినా జగ్గూ వినే స్థితిలో లేదు.

గంగులు మిన్నకుండిపోయాడు.

✦ ✦ ✦



"కీ॥శే॥ కాబోతున్న గజదొంగ గంగులు

పుట్టిన తేదీ : లేదు

చచ్చిన తేదీ : చావలేదు.

ముప్పై అడుగుల కాంస్య విగ్రహావిష్కరణ. తేదీ : 18-6-2013

ఊరు ఊరంతా గంగులు విగ్రహాలే ... చిద్విలాసంగా చిరునవ్వులు చిందిస్తున్న విగ్రహాలు చూపురులను ఆకర్షిస్తున్నాయ్. ముందెవరికీ ఏమీ అర్థం కాలేదు. క్రింద వివరాలు చదివేక విషయం అర్థమైంది.

రోజులు గడుస్తున్న కొద్దీ మర్డర్‌లు చేసేవాళ్ళవి, రౌడీలవీ, భూ కబ్జాదారులవీ, గూండాలవీ, అక్రమంగా డబ్బు సంపాదించే వెధవలందరివీ విగ్రహాలతో ఊరంతా నిండి పోసాగింది.


తన సోదరులందరివీ విగ్రహాలు ఏర్పాటయిపోవడంతో ధైర్యంగా గుబురు గడ్డం నిమురుకున్నాడు గంగులు.

అడుగడుగున ఏర్పాటయిన విగ్రహాలతో... ఊరు సమాధులతో నిండిన శ్మశానమై పోయినట్లుగా ఉంది... అసలే రౌడీలు, గజ దొంగలు, గూండాల విగ్రహాలు - వారితో తలపడలేక ఊరు ఊరంతా ఖాళీ అయిపోయింది.

వాళ్ళ మధ్య తాను ఎందుకుండాలనుకునో ఏమో - కాకి రెట్టలతో గాంధీ రూపం కనుమరుగైపోయే ముందే...తెరమరుగైపోయింది.

"చేసే పనిలో చిత్తశుద్ధి (కొంత డొక్కశుద్ధి) ఉండాలి!"

–బాలి



బాలి!... ఈ పేరు వినగానే అందమైన బొమ్మలు... నవ్వించే కార్టూన్లు... మన కళ్ళెదుట ప్రత్యక్షమైపోతాయి... కొంతమందికి ఈయన చిత్రకారులు గానే తెలుసు... మరికొంతమందికి కార్టూనిస్ట్‌గా తెలుసు... ఈయన కత్తికి రెండు వైపుల పదునే.... ఆ పదును తీవ్రత ఎలాంటిదో... ఆయన మాటల్లో ఇక్కడ తెలుసుకుందాం... మున్ముందు పేజీల్లో ఆయన బొమ్మల్ని... కార్టూన్లను ఆస్వాదిద్దాం! ముందుగా ఆయన భావాలు తెలుసుకోవడానికి కొన్ని ప్రశ్నలు హాస్యానందం విసిరితే... అంతే స్పీడ్‌గా ఆయన సమాధానాలు వదిలారు... వాటిని చదివేద్దామా!

✦ మీ అసలు పేరు నుండి బాలిగా రూపాంతరం చెందటం వెనుక కథేమిటో చెప్తారా?

నాకు ఆంధ్రజ్యోతి వారపత్రికకు బొమ్మలు వేసే అవకాశం కల్పిస్తూ శ్రీ పురాణం గారితో పరిచయమవుతున్న కొత్తల్లో ఆయన పంపుతున్న కథలకు బొమ్మలు వేసి చివరిలో బొమ్మ క్రింద 'శంకర్' అని సంతకం చేస్తూ ముగించే వాడిని. నా పేరు శంకర్రావు కాబట్టి.

అప్పట్లో ఇలా 'శంకర్' అని సంతకం చేసే వారు ఇద్దరు ముగ్గు రుండే వారు. అయితే ఆ సంతకం చేసే విధానంలో తేడాలుండవచ్చు. పురాణంగారు అది గమనించి 'బాలి' అని నామకరణం చేసారు. మొదట్లో నాకిది ఎబ్బెట్టుగా తోచింది – 'బా' అనే అక్షరం న్యూమరాల జీలో మంచిదట. సరే ఏదయితేనేం అని సరిపెటుకొని. 'బాలి' అనే బొమ్మల కింద సంతకం చేయడం మొదలు పెట్టాను. ఈ లోపు మరీ ముఖ్యమయితే తప్ప నా అసలుపేరు గుర్తుకు రావడం తగ్గిపోయింది.

✦ చిత్రకళలో మీ ప్రస్థానం గురించి కాస్త వివరించండి?

ఈ మధ్య పుస్తకాలు... మరీ ముఖ్యంగా యోగమూ, వాశిష్ఠమూ, ధ్యానమూ లాంటి తెలుగు పుస్తకాలూ, ప్రిన్సిపుల్ ఆఫ్ యోగా, ఓషో జిన్‌కోజోతిన్ పెయూన్ లాంటివి చదువుతోంటే ఈ లలిత కళలకు గానీ, మరి దేనికి గాని పూర్వ జన్మ ఫలం లేక దాని వాసనలు ముఖ్యమేమో అనిపిస్తున్నాయి. మా అమ్మ చక్కగా పాడేది. అందంగా ముగ్గులు వేసేది. మా నాన్నగారూ చక్కగా బొమ్మలు వేసిన వ్యక్తే. నా అయిదవ ఏట నాకు తెలియకుండానే ఆ పరిమళం నాకు అబ్బినట్టున్నది. బొమ్మలు చక్కగా వేయాలన్న సరదా పుట్టింది. రంగు పెన్సిళ్ళతో నాకు తోచిన విధంగా పువ్వుల బొమ్మలు వేసే వాడిని అవన్నీ చిన్న చిన్న గీతలలో. ఇదంతా కూనూర్ (నిలగిరి)లో జరిగింది. మా నాన్న మిలటరీలో ఉంటున్నారు. కాబట్టి మేమూ అక్కడే ఉండేవారం. ఇక ఆ తరువాత ఆ సరదా కొంచెం కొంచెం పెరిగి తీరిక దక్కినప్పుడల్లా బొమ్మలు వేయడమే సరదాగా ఉండేది.

✦ వర్ణ వైవిధ్యానికి, రేఖావిన్యాసానికి మీరు చిరునామా అంటారు. మీ శైలి ఏమిటి?

రేఖా చిత్రాలలో పెద్దగా రంగుల ప్రాధాన్యత ఉంటుందను కోను. అలాగని పూర్తిగా రంగుల ప్రభావమూ విస్మరించలేం. ఎంత వరకూ రంగులు వేయాలి, రేఖలు ఎలా గీయాలి. ఆ రేఖల్లో కూడా వైవిధ్యం ఎంత వరకు చూపాలి అన్నది చిత్రకారుని పరిశీలనా శక్తి అభ్యాసము మీద అధారపడి ఉంటుంది. ఆ రేఖలన్నా, బ్రష్, క్రోక్విల్, స్టెడ్లర్ ఇలా మార్చుకుంటూ వెళ్ళాలి. ఒకేలా ఉంటే చూపరులకు ముఖం మొత్తుతుంది. నేను అన్ని శైలుల్లోనూ (రచయిత ఇచ్చిన కథాకాలం బట్టి) వేయగలను. దానికి తగ్గ రంగులూ అద్దగలను. అది ప్రాక్టీస్ మీద వచ్చిందే.

✦ **కార్టూన్‌కి, ఇలస్ట్రేషన్‌కి భేదం చాలా మంది ప్రముఖులకు తెలియదనే విమర్శకు మీరేమంటారు?**

మీరన్నట్టు 'చాలా ప్రముఖులకే' ఈ రెండింటి మధ్యా తేడా తెలియదు. కార్టూన్‌ల్లో క్యారక్టర్‌ల కొలతలూ, హావభావాలూ, దానికి మనం ఇచ్చే గీతలూ (రేఖలూ) వేరు. అదే ఇలస్ట్రేషన్‌కయితే మొత్తం మారిపోతాయి. రియాల్టీకి దగ్గరగా వెళ్ళిపోతాయి. రచనలో రచయిత ఇచ్చిన భావనకు (సెంట్రలే ఐడియా) దగ్గరగా వెళ్ళాలని ప్రయత్నిస్తాము.

✦ **మీ పై ఎవరి ప్రభావాలున్నాయి?**

నాపై ఎవరి ప్రభావమూ లేదు. అయితే కొందరి బొమ్మలు పేపర్లో చూసే వాడిని. మొదట్లో 'ఇలా వేస్తే, అలా రాస్తే' అని అనుకొనే వాడిని శైశవ దశలో. అది సహజమని ఎదుగుతున్న దశలో తెలిసింది. ఇప్పుడు కథ చదువుతుంటేనే బొమ్మ నా కళ్ళ ముందు కొచ్చేస్తుంది. అయితే ఆ రచన చదివించే గుణం, ఆలోచింపచేసే నేర్పూ ఉండాలి. ఏవో కారణాల చేత ఎన్నిక కాబడి మా చేతుల్లోకొస్తాయి ఆ కథలు సగం జీవిం చచ్చి.

✦ **మీ శైలి బాపుకి అనుకరణ అని కొంతమంది అంటారు... మీ సమాధానం?**

నా శైలి గురించి నాకేం తెలియదు. ఆంధ్రజ్యోతి వార పత్రికలో అడుగు పెట్టినదాక బొమ్మలు ఎలా గీయాలో, ఎంత గీస్తే పేపర్లో రిడక్షన్ అయి పేజీలో సెట్ అవు తుందో తెలియదు. అక్షరాలు అలా రకరకాలుగా రాయడమూ తెలియదు. ఎడిటర్ పురాణం గారికి రాశాను. ఏవన్నా మంచి పేపర్లు (నా దృష్టిలో పేపర్ బట్టీ బొమ్మలో స్టైయిల్ మారుతుంది) కలాలూ పంపమని. కలాలు సంగతి ఆయనకు తెలియలేదు. గానీ ఏవో మంచి ఖరీదయిన పేపర్లు పంపారు.

'బొమ్మ గీసేటప్పుడు బాపు గార్ని దృష్టిలో పెట్టుకో' అన్నది ఆయనే. ఆయనెంతో సీనియర్! నిజమే. ఇక్కడో చిత్రమైన విషయం-కొత్తగా వార పత్రికలో ప్రకటించే నవలకు బొమ్మలు ఆయనతో గీయిస్తు న్నామని ప్రకటనలు గుప్పించి, మొదటి వారమే ఆయన బొమ్మతో సీరియల్ ప్రచురింపబడి, మిగిలిన అన్ని వారాలూ, చివరి వరకూ నా బొమ్మలతో వచ్చేవి. 'మరి నా పేరు ప్రకటనలో చేర్చవచ్చు కదా!' అని ఒకసారి అడిగితే



The art of Bali





ఆంధ్రచిత్ర కళారంగంలో 'బాలి' ఓ కలికితురాయి.
తెలుగు పత్రికా చిత్రకళ చరిత్ర అక్షరబద్ధం చేస్తే అందులో 'బాలి' శకం ఒకటుంటుంది... రేఖలకు, వర్ణాలకు మధ్య అనుబంధం తెలిసిన ప్రముఖులలో 'బాలి' ఆద్యుడు అనవచ్చు!

-తుంబలి శివాజీ

'నీకు పేరు మీద మహా దురదగా ఉన్నదే' అన్నది ఆయనే.

అంటే ఘోష గోవిందరాజులదీ, ముదుపు వెంకటరమణమూర్తిదీనన్న మాట! బంగారపు పళ్ళేనికయినా గోడ చేర్పు అవసరం.

✦ తెలుగుచిత్రకళలో మీకు తగిన గుర్తింపు వచ్చిందని భావిస్తున్నారా?

పై ప్రశ్నకు ఇది 'కంటిన్యూ' అని చెప్పుకోవాలి అంటే ఇక నేను పేరు మీద శ్రద్ధ పెట్టలేదు. నేను గవర్నమెంట్ ఉద్యోగం వదులుకొని వచ్చాను. కాబట్టి నేను విపరీతంగా శ్రమ చెయ్యాలి. అలాగయితేనే ఇక్కడ నిలబడ గలుగుతాను. చివరకు అదే చేశాను. ఇక గుర్తింపు అంటారా? అది పాఠకులే చెప్పాలి.

✦ సహచిత్రకారులతో మీ సంబంధాలెలా ఉంటాయి?

సహ చిత్రకారులు నాతో కాబట్టి 'సహ' జంగానే ఉంటాయి. అందువల్లనే నా కార్టూన్ పుస్తకాని నొకదాన్ని నా 'సహ' చిత్రకారులందరికీ అంకితమిచ్చాను.

✦ మనకున్న ప్రముఖ చిత్రకారులు గానీ... కార్టూనిస్టులుగానీ ఇంచుమించు అందరూ చలనచిత్రం కోసం పని చేసారు. మీరు కూడా టీవీ కోసం గానీ సినిమా కోసం గానీ పని చేసారా?

ఇలా ఎవరు చేశారో నేను లెక్కవేయలేదు. అది చిత్రకళాంశములోని 'టార్గెట్టా' కాదు. 'తరం మారింది' (డైరక్షన్, సింగీతం శ్రీనివాసరావు) సినిమాకు పబ్లిసిటీ చేశాను. అందులో ఓ కారెక్టర్‌కు ఆ సిన్మాలో 'బాలి' అని నాపేరు పెట్టారు. 'లింగబాబు లవ్ స్టోరీ' 'పూలపల్లకీ' సిన్మాల్లో చిన్న చిన్న వేషాలు వేశాను.

'స్త్రీ' అనే డాక్యుమెంటరీ పిక్చర్‌లో చాలా వరకూ సంఘటనలు నా బొమ్మల పైనే నడుస్తాయి.

✦ అచ్చమైన తెలుగు చిత్రకళ రూపు రేఖలకు మీ నిర్వచనం ఏమిటి?

ఇది గొప్ప ప్రశ్న! అయితే ఇది నిర్వచించేటంత గొప్ప వాడ్ని కాదు. మహాజలధి లాంటి 'తెలుగు చిత్ర కళ రూపురేఖలకు నా నిర్వచనం అనే సాహసం కాకిరెట్ట లాంటిది.

✦ చిత్రకారుల సంతకాల్లో ఆ గోప్యత ఎందుకుంటుంది?

'సంతకాల్లో గోప్యత'?... ఇది చాలా విడ్డూరంగా ఉంది. ఆ బొమ్మలను తానే వేశానంటూ చివర్న ఆ చిత్రకారుడు సంతకం పెడుతోంటే ఇక గోప్యం ఎక్కడుంది. మొత్తం తన పేరంతా పెడితే అసలు కన్నా కొసరే ఎక్కువవుతుందని జనం భయపడతారని ఏవో రెండోమూడో అక్షరాల్లో తన పేరు రాసి ఉండవచ్చు.

✦ చిత్రకళలో పోకడలేమిటి? వాటిపై మీ అభిప్రాయమేమిటి?

చిత్ర కళలో పోకడలంటే ఒక రకంగా కొన్నాళ్ళు వేసిన తరువాత ముఖం మొత్తితే మరోలా వేస్తూ సమర్థించుకోవడమే కొత్త పోకడ. ఇవన్నీ యూరోపియన్లు చేసే వెర్రి ప్రక్రియలు. ఇవన్నీ ఫైనార్ట్స్‌లోనే కనిపిస్తాయి.యూరప్ చిత్ర కళను చక్కగా పరిశీలించి, దానిపై విమర్శనా వ్యాసాలు వ్రాసిన ఒక పాత క్రిటిక్ రాసిందాన్ని నేను చదవడం జరిగింది. ఇది చదివి ఐదారు సంవత్స రాలు జరిగి ఉంటుంది. వారి చిత్రకళంతా (ఫ్రాన్స్, స్పెయిన్, జర్మన్, బ్రిటన్, హంగేరీ) ప్రపంచ యుద్ధాల మధ్యలో జరిగిన కాలంలోనూ, సోషలిస్టు, కమ్యూనిస్టు భావ జాలంలోనూ విశృంఖలంగా తిరిగి వంటికి అంటించుకున్న సుఖరోగాల మధ్య కలిగే నొప్పుల మయమై పోయి ఉంటుందట. మధ్య, మధ్య కలిగే మూలుగుల్లో నెమ్మదిగా



ఏమంటారంటే "ప్రపంచ బాధే నా బాధ" అని.

✦ **చిత్రకారులు వేరే ప్రపంచంలో ఉంటారా?**

లేదు. ఇక్కడే ఉంటారు. వెధవ బాధల్తో అలా అని పింప చేస్తారు.

✦ **మీ చిత్రాలు జాతిని జాగృతం చేసిన సందర్భాలేమిటి?**

నా బొమ్మలు – 'జాతిని జాగృతం చెయ్యటం' ఇదేదో గొప్ప మాట. నన్నే జాగృతం చెయ్యడం లేదు. ప్రపంచం దాకా ఎందుకు? బొమ్మలు వేయించుకున్నవారు నా డబ్బులు నా చేతిలో పెడితే చాలు.

✦ **చిత్రకళపై ఇప్పటి సాంకేతికత ప్రభావం మంచిదేనా?**

మంచిదే. మార్పు ఎప్పుడూ మంచిదే! అది సహజం కూడా.

✦ **మోడల్‌ని తీసుకొని వేసే చిత్రాలు అన్ని విషయాల్లో సరైనవేనా?**

'మోడల్‌ని' తీసుకొని ఇప్పుడెవరు వేస్తున్నారు. ఏదో ఎనాటమీ డ్రాయింగ్ సెక్షన్‌లో (పీరియడ్‌లో) తప్ప. అలా తీసుకున్న వారు ఇరవై శతాబ్దంలో మొదట్లోనే 'రాజా రవివర్మ'తో ఆగిపోయారు.

✦ **వచ్చే తరానికి మీరిచ్చే సందేశమేమిటి?**

సందేశాలిచ్చేంత గొప్పవాడ్ని కాదు గానీ చేసే పని చేసే పనిలో చిత్తశుద్ధి ఉంటే చాలు (కొంత డొక్కశుద్ధి)


✦ **హాస్యానందం గురించి మీ అభిప్రాయం?**

నా అభిప్రాయం సదభిప్రాయమే!! ప్రకటనలకు ఎగబడకుండా నలుగురినీ మంచి చేసుకుని ఓ మంచి కార్టూన్ పత్రికను నడుపుతున్న చి॥రాముకి మనసా అభివందనలు.

ఇంటర్వ్యూ: తుంబలి శివాజీ



The art of Bali





మల్లిక్ కామెడీ కథలు



తెలుగు నవల

'ఛీరేస్తాన్' రచయిత నెత్తురు కసాయిరావ్. (ఆంధ్రుల అభిమాన, ఆరాధ్య రచయిత నెత్తురు కసాయిరావ్ నవల ఈ వారం నుండే ప్రారంభిస్తున్నాం. పాఠకులూ... ఈ కరుడుగట్టిన కసాయ్ సీరియల్, ఎక్సయిటింగ్ సీరియల్, సెక్సయిటింగ్ సీరియల్, హింసాత్మక పాషాణ సీరియల్ కోసం కళ్లని పత్తికాయలు చేస్కుని ఇన్నాళ్లూ పిచ్చిగా ఎదురుచూశారుగా... ఇక చదవండి... చదివి నెత్తిబాదుకు ఏడ్వండి.... మీ ఎడిటర్)

1వ వారం

మందాకిని పరుగుతీస్తుంది...

ఆమె శరీరం చెమటతో తడిచిపోతూంది.

ఎండిన పుల్లలు ఆమె పాదాలకింద పడి... చిటుకు చిటుకుమని శబ్దం చేస్తున్నాయ్.

మందాకిని పాదాలు చిట్లి రక్తం స్రవిస్తుంది. అలా పరుగుతీయడంతో ఆమె చీర జారిపోయి ఎక్కడో పడిపోయింది. ప్రస్తుతం ఆమె లంగా, జాకెట్‌తో పరుగు తీస్తుంది (ఆమె లంగా జాకెట్‌తో పరుగు తీయడం మనసులో ఊహించుకుని పాఠకులు లొట్టలు వేస్తారని నాకు తెల్సు -రచయిత).

ఒకసారి వెనక్కి తిరిగిచూసింది. వాళ్లు నలుగురూ రానురాను దగ్గరికి వచ్చేస్తున్నారు.

హఠాత్తుగా ఒక రాయికి తట్టుకుని మందాకిని కిందపడిపోయి కాస్తదూరం దొర్లింది. ఆమె శరీరం మొత్తం గీసుకుపోయి నెత్తురు స్రవించసాగింది. మూలుగుతూ లేవబోయిన మందాకిని చూసింది...

ఆ నలుగురు దుర్మార్గులూ మందాకిని చుట్టూ మూగిపోయి ఉన్నారు. వాళ్లు కోర్కెలతో బుసలు కొడ్తూ ఆమె మీదికి వంగారు.

అప్పుడు భయంతో ఆమెపెట్టిన కేకతో ఆ ప్రదేశం మారుమ్రోగింది.

2వ వారం

'ధన్'మని పెద్ద శబ్దం అయ్యింది.

భయంతో కళ్లుమూస్కుని ఉన్న మందాకిని ఆ శబ్దం విని కళ్లు తెరిచింది.

నలుగురిలో ఒక రౌడి దూరంగా నేలమీద పడి ఉన్నాడు. అతని నోటినుండి రక్తం కారుతూ ఉంది. వాళ్లకి ఎదురుగా ప్రళయకాల రుద్రుడిలా ప్రభంజన్ ఉన్నాడు.

"ఒక ఆడపిల్లని నిస్సహాయురాల్ని, ఒంటరిదాన్నీ చేసి ఆమె శీలాన్ని దోచుకోవాలని అనుకుంటార్రా...మిమ్మల్ని ఏంచేస్తానో చూడండి" రౌద్రంగా అరిచాడు ప్రభంజన్.

సరిగ్గా అదే సమయంలో వాళ్ల నలుగురిలో ఒకడు బుర్రగోక్కున్నాడు.

వాడలా బుర్ర గోక్కుంటే చూసి ఉలిక్కిపడ్డాడు ప్రభంజన్.

అతని కళ్లముందు గతం అంతా సినిమా రీలులా తిరిగింది.

"అమ్మా" అంటూ ఆర్తనాదం చేశాడు ప్రభంజన్.

3వ వారం

"ఏంట్రా నాయనా గుండెలదిరిపోయేలా ఇట్టా అరిచాడు!" అనుకున్నారు నలుగురు.

గతాన్ని అంతా ఓసారి తలుచుకున్నాక రెండో వ్యక్తి వంక చూశాడు.

రెండో వ్యక్తి ముక్కులో వేలు పెట్టి గిరగిరా తిప్పాడు. ప్రభంజన్ మళ్లీ ఉలిక్కిపడ్డాడు.

వీడుకూడా వాడే... తన చిన్నతనంలో... తనకి ఆరేళ్ల వయసప్పుడు...

"అమ్మా!..." మరోసారి ఆర్తనాదం చేసి మూడోవ్యక్తి వంకా, నాలుగో వ్యక్తి వంకా చూశాడు.

మూడోవ్యక్తి జేబులోంచి పుల్లతీసి పళ్లు కుట్టుకున్నాడు. నాలుగోవ్యక్తి చెవిలో చిటికెన వేలు పెట్టి తిప్పసాగాడు.

ప్రభంజన్ ఉలిక్కిపడి "అమ్మా... అమ్మా..." అంటూ రెండుసార్లు ఆర్తనాదం చేశాడు.

'వీళ్లు నలుగురూ వాళ్లే!.... అనుకున్నాడు.

అతని కళ్లు అగ్నిగోళాలయ్యాయ్.

"ఒరేయ్! ఇరవైఏళ్ల క్రితం గుర్తుందిరా?... మీరు ఎంత అన్యాయం చేశారో!!.." గట్టిగా అరిచాడు.

"ఇరవైఏళ్ల క్రితమా?... ఏం చేశాం?" అన్నాడు అందులో ఒకడు.

"మా అమ్మని మీరు నలుగురూ కలిసి రేప్ చేశారు... అయితే మీరు నలుగురూ ఇంకా



ఈ రేపులు చేసే బిజినెస్ మాన్లేదన్నమాట!!" పళ్లునూర్తూ అన్నాడు ప్రభంజన్.

"మీ అమ్మనా?.. ఎవరు మీ అమ్మ?"

"జానకి!" జవాబు చెప్పాడు ప్రభంజన్.

అంతే! నలుగురూ ఒక్కసారిగా ప్రభంజన్ మీదపడి అతన్ని కిందపడేశారు.

ఒకడు ప్రభంజన్ వీపుమీద కూర్చున్నాడు. మరొకడు అతని చేతులు నొక్కిపడ్తే ఇంకొకడు కాళ్లునొక్కి పట్టాడు. నాలుగో వాడు ప్రభంజన్ పంట్లాన్ని పట్టి కాస్త కిందికిలాగి చూశాడు.

అతని కళ్లు ఆశ్చర్యంతో పెద్దవి అయ్యాయ్. అంతలోనే భయంకరంగా గావుకేకపెట్టాడు.

4వ వారం

"ఉందా?.." ఆతృతగా అడిగారు మిగతా ముగ్గురూ.

"ఉంది... వీడి పిర్రమీద కుంకుడుగింజంత పుట్టుమచ్చ ఉంది" చెప్పాడు నాలుగోవ్యక్తి.

"ఎడమ పిర్రా కుడిపిర్రా?"

"కుడి పిర్రే!" చెప్పాడు నాలుగోవాడు.

అది విన్న మిగతా ముగ్గురు కూడా గావుకేకపెట్టారు.


"అయితే వీడు నిస్సందేహంగా జానకికొడుకే! మనమీద ప్రతీకారం తీర్చుకుంటాడు..." ఇలా అనుకుని ప్రభంజన్‌ని వదిలిపెట్టి ఆ నలుగురూ పరుగుతీశారు.

ప్రభంజన్ మందాకిని చేయిపట్టుకుని "మీరు కూడా రండి" అని ఆమెతోబాటు వాళ్లవెంట పడ్డాడు.

కొంతదూరం పరుగెత్తిన తరువాత వాళ్లు నలుగురూ ఒక జీప్ ఎక్కారు. జీపు రివ్వున ముందుకు కదిలింది. అక్కడే ఒక మోటర్‌సైకిల్ ఉంటే దానిమీద ప్రభంజన్ మందాకినీ కూర్చుని వారిని వెంబడించారు.



ఒక రైల్వే లెవెల్ క్రాసింగ్ దగ్గర జీపుదాటి వెళ్లిపోయిన తరువాత రైల్వేగేటు పడిపోయింది. ప్రభంజన్ పిడికిలి బిగించి మోటర్‌సైకిలు పెట్రోలు ట్యాంక్‌మీద కసిగా గుద్దేడు.




5వ వారం

మందాకిని కళ్లనుండి ధారాపాతంగా అశ్రువులు కార్తున్నాయ్. ఆమె అప్పుడే ప్రభంజన్ చెప్పిన హృదయవిదారకమైన అతని గాథని అతను చెప్తుండగా తెలుసుకుంటూ ఉంది.

ప్రభంజన్ తన కళ్లనుండి రక్తాశ్రువులు స్రవిస్తూ ఉండగా చెప్పసాగాడు.

"అలా మా అమ్మ జానకిని నలుగురూ కలిసి రేప్ చేసిన తరువాత ఆమెని చంపేసి ఆ హత్యానేరాన్ని మా నాన్నగారి మీదకు తోసేసారు ఆ దుర్మార్గులు... చట్టానికి చెవులేగానీ కళ్లుండవు మందా!... అందుచేత మానాన్నకి ఉరిశిక్ష పడింది... నేను అనాథనయ్యాను" చెప్పడం ముగించాడు ప్రభంజన్.



అతని కళ్లనుండి ధారాపాతంగా కన్నీళ్లు కార్తున్నాయ్.

మందాకిని చీరచెంగుతో అతని కన్నీళ్లు తుడవాలని అనుకుందిగానీ తీరా చూస్కుంటే తన ఒంటిమీద చీరలేదు. ఆమె లంగా, జాకెట్టుతోనే ఉంది. అతని కన్నీళ్లు కూడా తుడిచేందుకు వీలు లేని తన దుస్థితికి ఆమెకి దుఃఖం వచ్చింది. ప్రభంజన్ తలని రెండు చేతుల్తో లాక్కుని తన గుండెలకి అదుము కుంది.

తన మొహాన్ని ఆమె గుండెలకేసి రాసి కన్నీళ్లు చెరిపేస్తున్నాడు ప్రభంజన్. కానీ అలా చెయ్యడంవల్ల అతనిలో ఉద్రేకం చెలరేగింది.

ఆమెని అమాంతం ఎత్తి గడ్డిలో వెల్లకిలా పడేశాడు. అలా పడడంలో మందాకిని లంగా పైదాకా చెదిరిపోయింది. ఆమె వంక కాంక్షతో చూసిన ప్రభంజన్ ఆమె మీదపడి ... ...

... ...

(ఛీ... ఛీ... ఇక్కడ నేనిహ రాయలేను బాబూ -మల్లిక్)

6వ వారం

"ఊ... " పాప దీనంగా మూలిగింది.

మందాకినిని ఓ పట్టుపట్టిన హుషారులో విజిలేస్కుంటూ అప్పుడే ఇంటికి వచ్చిన ప్రభంజన్ పాప మూలుగువిని రతీమని హాలు మధ్యలో ఆగిపోయాడు.

ఓ పక్కగా వదిన అన్నపూర్ణ నిలబడి చెంగుతో కళ్లొత్తుకుంటూ ఉంది.

"పాపెందుకు మూలుగుతుంది వదినా? నువ్వెందుకు ఏడుస్తున్నావ్" వదినని అడిగాడు ప్రభంజన్.

అప్పుడు అన్నపూర్ణ చెప్పింది విని ప్రక్కలో బాంబు పేలినట్టు అదిరిపడ్డాడు ప్రభంజన్.

7వ వారం

అర్ధరాత్రి పన్నెండు గంటలైంది.

అది స్మశానం. ఆ స్మశానంలో ఒంటరిగా నడుస్తున్నాడు ప్రభంజన్ జంకూ గొంకూ లేకుండా. అతని కాళ్లకిందపడి పుర్రెలు ఫటఫట చిట్లుతున్నాయ్. స్మశానంలో చితి మంటలు అక్కడక్కడా మెల్లమెల్లగా మండు తున్నాయ్. నక్కలు పాతిపెట్టిన శవాలని వెలికి లాగి పీక్కుతింటున్నాయ్.

స్మశానం మధ్యలో ముగ్గువేస్కుని దానిమీద కూర్చుని మాంత్రికుడు మహమ్మద్ పీరా మంత్రాలు చదువుతున్నాడు.

అతన్ని చూస్తూనే ప్రభంజన్ కళ్లు అగ్నిగోళాలయ్యాయ్. పరుగున వెళ్లి పీరా గొంతుపట్టి పైకిలేపి గెడ్డం కింద ఒక్కటిచ్చాడు.

అప్పుడు మాంత్రికుడు పీరా పెట్టిన కేకకి స్మశానంలోని శవాలుసైతం గడగడ లాడాయ్.

8వ వారం

"రాత్రి నేను ఆ మాంత్రికుడ్ని చితక్కొట్టాను. వదినా... కానీ వాడు మన పాపకి చేతబడి చేయలేదు" చెప్పాడు ప్రభంజన్.

"మరి మన పాప ఎందుకు చిక్కిపోతూ ఉంది?" అంది అన్నపూర్ణ.

ప్రభంజన్ పాపని డాక్టర్‌కి చూపించాడు.

డాక్టర్ చెప్పింది విని అదిరిపడ్డాడు ప్రభంజన్.

"మీ పాపని ఎవరో నలుగురు రేప్ చేసినట్టున్నారు. అందుకే పాపకి మానసికంగా దెబ్బ తగిలి అలా చిక్కిపోతూంది."

ప్రభంజన్ పిడికిళ్లు బిగుసుకున్నాయ్.

"ఆ నాడు మా అమ్మని రేప్ చేశారు... ఈనాడు పసిది అనైనా ఆలోచించకుండా పాపని రేప్ చేశారు. ఇది తప్పకుండా వాళ్ల పనే!... వాళ్ల అంతు చూడందే నిద్రపోను..." అనుకున్నాడు.

0వ వారం

మందాకిని సహాయంతో వాళ్లు నలుగురూ ఎవరో తెలుసుకున్న ప్రభంజన్ ఆశ్చర్య పోయాడు.

వాళ్ల నలుగురిలో ఒకడు పోలీస్ కమీషనర్, ఒకడు పెద్ద ఇండస్ట్రియలిస్ట్, ఒకడు స్మగ్లరు, ఒకడేమో ప్రపంచ ప్రఖ్యాత ఆర్టిస్టు.

తన తల్లిని రేప్ చేసినప్పుడు ఆ పోలీసు కమిషనర్ కానిస్టేబుల్‌గా పనిచేసేవాడు. ఆ ఇండస్ట్రియలిస్టుకి ఒక కిళ్లీకొట్టు ఉండేది. స్మగ్లరు కాఫీ హోటల్లో క్లీనరుగా ఉండేవాడు. ఆ ఆర్టిస్టు రోడ్డుమీద చాక్‌పీసుల్తో ఆంజనేయస్వామి బొమ్మలు గీసేవాడు.

ఆ నలుగురి గురించీ ఇన్ఫర్మేషన్ తెలుసు కున్నాక హోటల్ గదిలో మందాకినిని మంచం మీద ఎత్తిపడేసిన ప్రభంజన్... ...,

(సారీ... ఇక్కడ కూడా నెత్తురు కసాయ్‌రావు నవల్లో ఏంరాశాడో నేను చెప్పలేను)

10వ వారం

అప్పటికి అలా గంటనుండి ఆ కారుని ఛేజ్ చేస్తున్నాడు ప్రభంజన్. చివరికి మోటర్ సైకిల్‌తో కారుని ఓవర్‌టేక్‌చేసి కారుకి అడ్డంగా నిలబెట్టేడు. అందులోని స్మగ్లర్‌ని పట్టి కిందికి లాగి అతని మర్మావయవాన్ని కత్తితో కోసేశాడు.

(కథ ఇలానే 30వారాలు సాగుతుంది. విలన్లందరూ చచ్చాక మందాకిని, ప్రభంజన్‌ల వివాహంతో సుఖాంతం అవుతుంది. -రచయిత)

మంచి మనిషి బాలి

బాలిగార్ని మొట్టమొదటిసారిగా ఆంధ్ర జ్యోతి ఆఫీసులో కలిశాను. ఐతే వారి సీటు ముందు కూర్చున్న రెండు మూడు నిమిషాలకే ఎడిటరు గారి నుండి పిలుపొచ్చింది.

ఎడిటర్ గదిలోకి వెళ్ళిపోయాను. తరువాత కొన్నేళ్ళు గడిచాక, బాలిగారిని బందరురోడ్లో వాళ్ళింట్లో కలిశాను. సాదరంగా ఆహ్వానించి నాతో కబుర్లాడి పంపించారు. అంత పెద్ద ఆర్టిస్టయిన ఎంతో నిగర్వంగా ఒక చాపమీద కూర్చుని బొమ్మలు గీసుకుంటూ జీవనం సాగించే బాలిని కలవడం నా అదృష్టంగా భావించాను.

2000వ సంవత్సరం హైదరాబాదు, లుంబిని పార్కులో తెలుగు కార్టూనిస్టుల ఎగ్జిబిషన్‌లో నాకు బాలిగారు కనిపించారు.

'బాలీ' అని అరిచి, ఆయనవైపు నడిచి, కర చాలనం చేసి పలకరించాను. ఆ మాట, ఈ మాట మాట్లాడుతూ తనకేదైనా ఉద్యోగం చూసి పెట్టరా అని అడిగారు.


బాలి గారంతటి వ్యక్తి ఉద్యోగం కావాలంటే, ఇవ్వనివారెవరుంటారు. వారినెలా కాంటాక్టు చేయాలో, వివరాలు తెల్సుకుని, నా ఆఫీసుకు చేరుకున్నాను. అప్పట్లో నేను కలర్ చిప్స్ ఇండియా లిమిటెడ్‌లో, క్రియేటివ్ డైరక్టరు జాబ్ చేస్తున్నాను.

మరుసటిరోజు కలర్‌చిప్స్ సిండికేట్‌విభాగం చీఫ్‌గా చేస్తున్న కుంజేష్ పరిహార్ గారికి బాలి గురించి చెప్పాను. అదృష్టం కొద్దీ, కంపెనీలో, సిండికేట్ విభాగానికి చీఫ్‌ఆర్టిస్ట్ అవసరం కావల్సి ఉంది.

బాలిగారి వివరాలని, ఆయన టేబుల్ మీద పెట్టి, నా క్యాబిన్‌కు వెళ్ళిపోయాను. ఆ తర్వాత రెండ్రోజులకే అమెరికా వెళ్ళిపోయాను. పది హేను రోజులు తరువాత, నాకు అమెరికాలో, కలర్‌చిప్స్ నుండి ఫోను వచ్చింది. బాలి గారిని చీఫ్ ఆర్టిస్టుగా తీసుకున్నారని తెలిసి చాలా ఆనందించాను.

ఏ కథకైనా, ఏ కవితకైనా, ఏ జోకుకైనా, నిమిషాల్లో ఆయన కుంచె, క్రోక్విల్‌పాళీలు, బొమ్మలు సరసరా గీసి ర్యాకులు నింపేవి. కలర్ చిప్స్‌లో ఆయన మైనంపాటి భాస్కర్ గారు, పుక్కళ్ళ రామకృష్ణ కలిసి ఒక గ్రూపుగా పని చేసేవారు. నేను అప్పుడప్పుడు మెట్లుదిగి బాలిగారి క్యాబిన్‌లో పది, పదిహేను నిమిషాలు గడిపి, సేద తీర్చుకునేవాడిని. అలాంటి సమయాల్లో బాలిగారి గురించి కొన్ని విషయాలని గ్రహించే అవకాశాలు నాకు లభించాయి.

బాలి నిండైన మనిషి. తొణకని కుండ. తన సంతోషాన్ని తన దుఃఖాన్ని తనలోనే వుంచుకుని, విధిని సక్రమంగా నిర్వహించే, కార్య దక్షత కలిగిన ఉద్యోగి. అందుకే బాలిని అందరూ అభిమానించేవాళ్ళు.



బాలిగారు శలవులో ఉన్నారని హెచ్. ఆర్ చెప్పారు. ఊరెళ్ళారేమో అనుకున్నాను. ఒక రోజు ఆయన సీట్లో కనిపించారు. బాలిగారూ, ఎప్పుడొచ్చారు అని పలకరించబోయాను. లేచి నుంచుని నన్ను దగ్గరికి లాక్కుని తన సతీమణి కాలధర్మం చెందిన సంగతి చెప్పారు. ఆయన్ని గట్టిగా వాటేసుకున్నాను.

నిమిషం పాటు నా మది చలించిపోయింది. ఆయనే నన్ను తేరుకొనేలా చేశారు... ఒక చిరునవ్వు నవ్వి. నన్ను, నా క్యాబిన్‌కు సాగ నంపారు. అంత మెత్తటి మనిషికి ఎంత గట్టి గుండె. అలాంటి వ్యక్తులు ఈ రోజుల్లో మనకి చాలా అరుదుగా కనిపిస్తారు.

కలర్ చిప్స్‌లో, 2003 చివరిదాకా, బాలి గారితో కలిసి పనిచేసే భాగ్యం నాకు దక్కింది. కలర్‌చిప్స్ రూపొందించిన "హనుమాన్ చాలీసా" శిల్పి ఆయనే.

ఎన్నో అపూర్వమైన బొమ్మలు కథలు, ఫీచర్లు, కార్టూన్ స్ట్రిపులు బాలిగారు కలర్‌చిప్స్ కొసరం సృష్టించారు.

ఆయన నేనూ కలిసి Menopause సబ్జెక్టు మీద 60 కార్టూన్లు, కేవలం ఒక వారం రోజుల్లోనే గీశాము. Reddy Labs వాళ్ళకోసం గీసిన ఆ కార్టూన్లు, నభూతో నభవిష్యతి! మా అనుభవం అంతా, వాటిల్లో కుదించాం! ఎప్పటికీ మరువలేని అపూర్వమైన అనుభూతి బాలి గారి సాంగత్యం ద్వారా నాకు లభించింది. పెద్ద పేరూ వచ్చింది!

బాలి గొప్ప వ్యక్తి. మనసులో వున్నది చెబుతాడు. ఏదీ దాచుకోడు. అంత మంచి మనిషికి ఈ ప్రత్యేక సంచిక అభినందన పుష్పగుచ్ఛం, అందిస్తున్నందుకు, చాలా సంతోషిస్తున్నాను.

బాలిగారు చల్లగా ఉండాలని, తెలుగు పాఠక లోకానికి, దీర్ఘకాల సేవలందించాలని ఆకాంక్షిస్తున్నాను. **–కార్టూనిస్టు జయదేవ్**





కండ్లకుంట శరత్‌చంద్ర

హాస్యచంద్ర 001



"ఒక డిటెక్టివ్‌తో మాట్లాడడం ఇదే మొదటిసారి. నాకు థ్రిల్లింగ్‌గా ఉంది. మీ అడ్రస్ ఇస్తారా?" అడిగాడు ఒంగోలు వాసి.

"ష్యూర్. కానీ ఎందుకు?"

"అయ్యో ఎందుకంటారేంటి... అక్రమ సంబంధాలు, కిడ్నాపులు, దొంగతనాలు, పెళ్ళిసంబంధాల్లో... అబ్బాయిదో, అమ్మాయిదో గుణగణాలు సేకరించడాలు... ఇలా ఎన్నో అవసరాలుంటాయిగా. నా స్నేహితులకు ఇస్తాను." చెప్పాడు ఒంగోలు వాసి.

హాస్యచంద్ర, తన విజిటింగ్ కార్డ్ ఇచ్చాడు. అప్పటిదాకా ఈ తతంగాన్ని ప్రత్యక్షంగా చూసిన జనాల్లో కొందరు హాస్యచంద్ర విజిటింగ్ కార్డులు అడిగి తీసుకున్నారు.

అలా తీసుకున్నవారిలోఅరవై ఏళ్ళ 'సంధ్యావందనం' కూడా ఉన్నాడు.

✦✦✦

డిటెక్టివ్ హాస్యచంద్ర, రీసెంట్‌గా అతడితో ప్రేమలో పడిన సమత...ఓ కాకాహోటల్‌లో కూర్చుని కాఫీ తాగుతున్నారు. ఒంగోలు వాసిగా నటించిన హాస్యచంద్ర మిత్రుడు రాము, అతని ప్రేయసి రమ్య వారికెదురుగా వచ్చి కూర్చున్నారు.

"మన నాటకం గ్రాండ్ సక్సెస్ అయిన సందర్భంలో ఈ మినీ పార్టీ" చెప్పాడు హాస్యచంద్ర.

అందరూ సగంఖాళీ చేసిన గ్లాసులతో ఛీర్స్ కొట్టారు.

హాస్యచంద్ర ముంబైలో ట్రైనింగ్ తీసుకుని వచ్చాడు. అయితే పేరున్న డాక్టర్ల దగ్గరికి, పేరున్న లాయర్ల దగ్గరికి క్లైంట్లు ఎలా వస్తారో, పేరున్న డిటెక్టివ్‌ల వద్దకే ఎక్కువగా వస్తారు. 'పేరు' రావాలంటే కష్టపడడం ఎంత ముఖ్యమో...తమ సర్వీసెస్‌ను ప్రమోట్ చేస్కోవడమూ అంతే ముఖ్యం. టీవీల ద్వారా, పత్రికల ద్వారా వచ్చే పబ్లిసిటీ ఎంత ముఖ్యమో... మౌత్ టూ మౌత్ పబ్లిసిటీ కూడా అంతే ముఖ్యం. అందుకే తన ప్రేయసినీ, మిత్రుడినీ, అతగాడి ప్రేయసినీ ఒప్పించి ఇలా 'పబ్లిసిటీ' డిజైన్ చేసాడు.

"ఎన్ని కాల్స్ వచ్చాయి?" అడిగింది రమ్య.

"మొత్తం నలభై రెండు విజిటింగ్ కార్డులిచ్చాను... ఇప్పటి వరకూ ఎనిమిది కాల్స్ వచ్చాయి. వాళ్ళందిరికీ రేపు అపాయింట్‌మెంట్ ఇచ్చాను." చెప్పాడు హాస్యచంద్ర.

"ఊం! గుడ్. మిగితా వాళ్ళూ నెమ్మదిగా వస్తారులే. తమ సమస్యలకు డిటెక్టివ్ సహకారం తీసుకోవచ్చని వారికి ఈ రోజు ప్రాక్టికల్‌గా అర్థం అయ్యింది. ఆలోచించుకుని మరీ వస్తారు. మరికొందరు ఈ రోజు జరిగింది, వారి బంధువులకూ.... స్నేహితులకూ చెప్తారు. అలా కూడా నీకు కేసులొస్తాయి." చెప్పాడు రాము.

ఆ తర్వాత రెండు జంటలూ విడిపోయాయి.


ఒకటి ఇందిరాపార్కుకూ...

ఇంకోటి లుంబినీపార్కుకూ వెళ్ళి యధాశక్తి ప్రేమించుకుని ప్రేమ కబుర్లూ గాలి కబుర్లూ చెప్పుకున్నాయి.

✦✦✦

"నీ యొక్క నెల జీతమూ ఒక సహస్రం. ఏప్రిల్, జూన్, సెప్టెంబర్, నవంబర్ నెలల్లో త్రిదశం రోజులుంటాయి. మిగితా నెలల్లో ఒక రోజు ఎక్కువగానూ, ఫిబ్రవరిలో 2 రోజులు

జరిగిన కథ: హాస్యచంద్ర ఓ ప్రైవేట్ డిటెక్టివ్. ఒక పెద్ద షాపింగ్ కాంప్లెక్స్‌లో భార్య తప్పిపోతే కంగారు పడుతున్న ఒకతనికి మాస్టర్‌ప్లాన్ వేసి అతని భార్య అక్కడికి చేరుకునేట్లు చేస్తాడు హాస్యచంద్ర. తరువాత.... -ఇక చదవండి



తక్కువగానూ ఉంటాయి. లెక్కవేస్తే నీకు రోజుకు "ముప్పది మూడు రూపాయల ముప్పది మూడు పైసలు" తక్కువగా వస్తాయి. మా ఇంట్లో ముగ్గురం ఉన్నాం, ఆ ముగ్గురిలో ఏ ఒక్కరయినా ఊరికి వెళితే 'పద కొండు రూపాయల పదకొండు పైసలు' ఆ రోజు లెక్కలో నీకు తగ్గు తాయి. ఒకవేళ మా ఇంటికి ఒక అతిథి వచ్చి ఇరవై నాలుగు గంటలు ఉంటే నీకు పదకొండు రూపాయల పదకొండు పైసలు వస్తాయి.

ఒకవేళ నువ్వు ఒకరోజు పనికి ఎగనామం పెడితే...ముప్పై రూపా యలు ముప్పై మూడు పైసలు నీ జీతం నుండి ఊచకోత కోయబడ తాయి. ప్రతీనెలా నీకు ఒక దినం ఐచ్ఛిక సెలవు మంజూరు చేస్తున్నాను.

సమయమును నా శ్రీమతితో నమోదు చేయించాలి.

పనులన్నీ పూర్తయి వెళ్ళేటప్పుడు, అదే రిజిస్టర్‌లో ఉన్న- తుడుచుట, ఊడ్చుట, ఉతుకుట, తోముట....అను నాలుగు డబ్బాలలో మా శ్రీమతి చేత....ఒప్పు, తప్పు గుర్తులను వేయించి, మళ్ళీ నీ చేవ్రాలు లేదా వేలిముద్ర పెట్టి వెళ్ళి పోవాలి. మా అపార్ట్‌మెంట్‌లో నీవు పనిచేసే లేదా నీ కొలీగ్స్ పనిచేసే ఇళ్ళలో నుండి సమాచారమును సేకరించి మాకు చేరవేయాలి. సాధారణ వార్తకు రూపాయి, అసాధరణ వార్తకు రెండు రూపాయిలు...అతి అసాధారణ వార్తకు మూడు రూపాయల చొప్పున చెల్లిస్తాను. దీనిని ఏ రోజుకారోజు రిజిస్టర్‌లో నమోదు చేయిం చుకోవాలి. ఒకవేళ మాకు సంబంధించిన వార్తలను ఇతరుల ఇళ్ళకు



నీవు చేయవలసిన పని మా ఇల్లు శుభ్రముగా ఊడ్చి, తుడిచి, మా బట్టలు ఉతికి, అంట్లు తోమాలి. ఈ నాలుగు పనుల్లో సమయాభావం వల్ల నువ్వు ఏ పనినైనా ఒక రోజు చేయలేకపోతే... ఒక జీతం నుండి, 'ఎనిమిది రూపాయల ముప్పైమూడు పైసలు గీకివేయబడుతుంది. నువ్వు ప్రతిరోజు 6.45 నుండి 7.15 లోపల రావాలి. రాగానే హాల్లోని బల్లపై ఉన్న రిజిస్టర్‌లో యధాశక్తి సంతకంగానీ, వేలిముద్రగానీ పెట్టి

చేరవేస్తున్నట్లు మాకు తెలిస్తే, సగం జీతం తగ్గించడం గానీ, విధుల నుంచి తప్పించడం కానీ జరుగుతుంది.

ప్రతీ సంక్రాంతి, దీపావళి పండుగలకు బోనస్‌గ వంద రూపాయలు ఇస్తాము. ప్రతీ సంవత్సరం 7.5శాతము డి.ఏ. అనగా కరువుభత్యంగా జీతం పెంచబడుతుంది. ఈ నిబంధనలకు అంగీకరిస్తే...ఒక పాస్‌పోర్టు సైజు ఫోటో, ఆధార్ కార్డు లేదా రేషన్ కార్డు లేదా ఓటరు కార్డు లేదా మరియేదైనా...ప్రభుత్వంచే జారీ చేయబడిన ధృవీకరణ పత్రం యొక్క

జిరాక్స్ కాపీతో మళ్ళీ నా ముందు ప్రత్యక్ష మవ్వు!!" ఒక్కొక్క వాక్యాన్ని ప్రశాంతంగా పలికాడు ప్రహేళికారావు.



పనిమనిషిగా వాళ్ళింట్లో ప్రవేశిద్దామను కున్న అప్పలమ్మకు అర్జెంటుగా మోకాళ్ళపై కూర్చుని, రెండు చేతులూ నేలకు ఆనించి, నాలుక బయటపెట్టి ఇల్లంతా తిరుగుతూ మధ్యమధ్యలో కాలెత్తాలనే ఫీలింగు కలిగింది.

"ఆయ్ బాబోయ్! ఇన్నేసి రూల్స్ గట్రా ఎడితే... నానేకాదు యాపనిమనిసీ మీ ఇంట కాలెట్టదు. పెపంచీకంలో పనిమనిసితో ఎవ రూ ఇట్టా మాట్లాడుండడు. నానేమైనా ప్రభు త్వ ఆఫీసుల గుమస్తాగిరీకి అచ్చిననుకున్నా నేటి! ఈ ఇల్లు కాపోతే....ఎయి ఇళ్ళు!" అని ప్రహేళికారావు భార్య సురభి వంక చూసి–

"అయ్ బాబోయ్! మీకు పొగడపూల దండేసి కాల్లు మొక్కాల. ఈ మడిసితో ఇన్నే ళ్ళ కాపురం చేసి నెగ్గుకొచ్చారంటే... మీరు ఇందిరమ్మ... సోనియమ్మల కంటే శానా గ్రేటండీ!!" అనేసి తుర్రున మాయమైంది.

"అబ్బబ్బ! ఏమిటండీ మీ చాదస్తం. ప్రభు త్వ ఆఫీసులో పనిచేసి రిటైరై ఏళ్ళు గడిచి పోయినా... ఎందుకు మీరిలా జనాల్ని అల్లప్ప చ్చడితో ఇడ్లీ నంచుకుని తిన్నట్లు... నంచుకు తింటున్నారు." అంది ఆయన సతి సురభి.

"అవునేవ్! ఇడ్లీ అంటే గుర్తొచ్చింది. నీ చెల్లెలి మొగుడు, తన బట్టతలకు హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకున్నాడటగా. ఈ సారి ఫోన్ చేసినప్పుడు ఎంత ఖర్చయ్యిందో కనుక్కో." అన్నాడు తన బట్టతలను తడుము కుంటూ.

"చాల్లేండి! కూతురికి పెళ్ళి చేయాల్సిన వయసులో" అంటూ లోపలికెళ్ళి పోయింది.

ముఖ్యమైన పాత్రలను వర్ణించి, పాఠకు లకు, వారిని పరిచయం చేయడం ఒహ టైపు!

ముందే పాత్రలను పరిచయం చేసి ఆ తర్వాత వర్ణించడం మరోటైపు!

పాత్రలను ప్రవేశ పెట్టి... అవసరమొచ్చి నప్పుడు ఏ మేరకు వర్ణించాలో, ఎంత వర్ణిం చాలో అలా కానిచ్చేయడం ఇంకో టైపు!

(ఈ రచనలో నేను మూడవ టైపును అను సరిస్తుండడం వల్ల వాడెంత ఎత్తున్నాడు, వీడు నల్లగా ఉన్నాడు, ఆవిడ గుండుపిన్నులా ఉంది, ఈవిడకు జుట్టు అసలుది కాదు, బందరు బస్టాండులో కొన్న సవరం...వగైరా ముందు గానే పాఠకులకు కనిపించవు – రచయిత)

'మీకు మీరే మాకు మేమే! ఎందుకీ వస వస నసనస! ఎందుకీ వసవస రుసరుస! మీకు మీరే మాకు మేమే!' ప్రహేళికారావు తన సెల్ మోగుతుండడంతో పడక్కుర్చీ నుండి లేచి సెల్ ఫోన్ అందుకుని–

"చెప్పండి సంధ్యావందనం గారూ ఈ రోజు మార్నింగ్ వాక్‌కు రాలేదేం?" అన్నాడు.

"ఈరోజు మా పనమ్మాయి రాలేదండీ. అంచేత నేను అంట్లుతోమాల్సి వచ్చింది."

"ఏమిటి సంగతి?"

"మీ అమ్మాయి ఎవరినైనా ప్రేమిస్తుందో లేదో లేక ప్రేమిస్తున్నానంటూ....ఆమె వెంట ఏ నిలువుగాడిదైనా పడుతున్నాడా! అనే సం దేహం మీకుంది కదా! అది తెల్సుకోవడానికి మహత్తరమైన ఉపాయం. నిన్న సాయంత్రం ఓ షాపింగ్ మాల్‌లో 'హాస్యచంద్ర' అనే ఒక ప్రైవేట్ డిటెక్టివ్ నేర్పును ప్రత్యక్షంగా పరిశీలిం చాను. అతనికి చెప్పారంటే మీ పని జరిగి పోతుంది."

"ఎంత తీసుకుంటాడు?"



"అది నాకు తెలియదు. కేసును బట్టి తీసుకోవచ్చు. ఒక సారి మాట్లాడండి, తెలుస్తుంది కదా!"

"సరే! ఫోన్ నెంబరు చెప్పండి!"

సంధ్యావందనం, హాస్యచంద్ర ఫోన్ నంబర్‌ను చెప్పి, ఫోన్ పెట్టేసాడు.

ప్రహేళికారావు, తన కూతురు స్నానంచేసేందుకు బాత్రూం లోకి వెళ్ళేదాకా ఆగి ఆ తర్వాత, హాస్యచంద్ర సెల్ ఫోన్ నంబర్ '9866499242' నొక్కాడు.

"ముక్కు మీద దురద పుట్టినా... కుక్క వచ్చి కాలెత్తినా... ఏమి చేయలేని దరిద్రపు బ్రతుకై పోయింది. మహాప్రభో! ఇప్పటికైనా కనికరించి...." హాస్యచంద్ర ఫోనెత్తాడు.

"హలో!"

"హాస్యచంద్రేనా అవతల?"

"అవునండీ! తమరూ..."

"ఇంతకు ముందు వినిపించిన కాలర్‌ట్యూను నటుడు బ్రహ్మానందం వాయిస్ కదూ?!"

"అవునండీ! జంధ్యాలగారు తీసిన 'వివాహ భోజనంబు' సినిమాలో సుత్తి వీరభద్రరావు, బ్రహ్మానందాన్ని గొంతు దాకా గోతిలో పూడ్చినప్పుడు చెప్పిన డైలాగ్!"

"అదేమిటోయ్! నీ పేరు అలావుంది"

"నా శరీరంలో హాస్యగ్రంథులు ఎక్కువగా ఉండడం వల్ల, ఆ పేరు పెట్టమని ఓ డాక్టరు మా నాన్నకు సూచించారు."

"నీ పేరేమిటి ఇలా వుంది?" అని అడిగిన వాళ్ళకు ఒక సారి చెప్పిన సమాధానం మళ్ళీ చెప్పకుండా రకరకాల సమాధానాలు చెప్తుంటాడు హాస్యచంద్ర.

"బావుందోయ్! విషయమేమిటంటే మా అమ్మాయి చాలా అందంగా ఉంటుంది. ఎవరైనా ప్రేమిస్తున్నామంటూ ఆమె వెంట పడుతున్నారా? అన్న విషయం కనుక్కుని వారి వివరాలు నాకివ్వాలి?... చేయగలవా?... ఫీజెంత?!"



The art of Bali

"మీ అమ్మాయి ఏం చేస్తుంది... ఉండేది హైదరాబాద్‌లోనేనా?!"

"హైద్రాబాద్‌లోనే. హైటెక్‌సిటిలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తుంది."

"అయితే చాలా ఈజీ. రెండువేల రూపాయలు చాలు. అవసరమైతే నా పెట్రోలు బిల్లు, ఫోన్‌ల బిల్లు మరో మూడొందలు చెల్లించాల్సి రావచ్చు"

"ఓహ్! చాలా నిజాయితీగానూ, అమాయకుడిలానూ ఉన్నావే!"

"అవునండీ! పెదరాయుడు సినిమాలో పెద్ద మోహన్ బాబంత నిజాయితీపరుణ్ణి, తిక్క శంకరయ్య సినిమాలో ఎన్టీయార్ అంతటి అమాయకుడ్నీ. మీ అమ్మాయి వివరాలు, పని చేసే కంపెనీ పేరు, మీ ఇంటి అడ్రసు చెప్పండి రాసుకుంటాను." (సశేషం)





సదా ఆనందం

అల్లం శశిధర్-9059998618

"అయ్యో! అయ్యో! భగవంతుడా ... నేనేం పాపం చేశాను.... నాకెందుకింత మానసిక క్షోభ!.... భాధ!!... దుఃఖం!!!... రోజూ ప్రొద్దున్నే స్నానం చేసి... గాయత్రీ మంత్రాన్ని చదువుతున్నా!... దండం పెడుతున్నా!!... దీపారాధన చేస్తున్నా... ఒకో రోజు ఒక్కో దేవున్ని ఆరాధిస్తున్నా ... నైవేద్యాన్ని సమర్పించు కుంటున్నాను... అయినా నాకే ఎందుకు ఇంత బాధను ఇస్తున్నావు.
ఛీ !.. నువ్వు లేవు .... వట్టి రాతి బొమ్మవు ...
పనికొచ్చేవాడివి కావు... భగవంతుడు వట్టి భ్రమ!!!! "

భగవంతుని మీద తన కోపాన్ని వెళ్ళగ్రక్కు తున్నాడు సదానందం.


సదానందం ఎప్పుడూ... తనకు ఇది కావాలి... అది కావాలి ... అని దేవుణ్ణి ప్రార్థించ లేదు... ప్రార్థించడు కూడా!

అయినా సదా ఆనందంగానే ఉంటాడు.

రోడ్డుమీద ఆక్సిడెంటు జరిగి ఎవరైనా చనిపోతే... తనకు అలా జరగనందుకు దేవునికి కృతజ్ఞతలు చెప్పేవాడు...

బాంబు పేలి జనాలు చనిపోతే తాను అక్కడ లేనందుకు సంతోషపడేవాడు. ఎక్కడ ప్రమాదం జరిగి ఎంతమంది చనిపోయినా బాధపడడు... పట్టించుకోడు. పైగా తాను అందులో... అక్కడ లేనందుకు ఆనందమే ఆనందం...

సినిమాలకి వెళ్ళడు ... పైరసీ సి.డీ.లలో చూసి ఈ మాత్రం సినిమా ఇలా చూస్తే సరి పోతుందిలే అనుకునేవాడు.



రాష్ట్రంలో అవినీతి పెచ్చు పెరిగిపోయిందని ఎవరైనా అంటే ...

'పని జరగాలంటే పైసలు ఖర్చు పెట్టాలి మరి... ఫ్రీగా జరగాలంటే ఎలా మరి' ఇదీ అతని వింత వాదన.

అటువంటి సదానందం ఫ్రెండ్ సుబ్బారావుకు సినిమాల్లో నటించే ఛాన్స్ వచ్చింది.

నూతన నటీనటులు కావలెను అన్న ప్రకటన చూసి వెళ్ళాడు.

అక్కడ దర్శక, నిర్మాతలకు అతను నచ్చి, మంచి వేషం ఇచ్చారు.

అప్పటినుంచి సుబ్బారావు భూమి మీద లేదు... తనను తాను పెద్ద స్టార్ లాగా ఊహిం

చుకోసాగాడు. ఖాళీగా ఉన్న మెగాస్టార్ పోస్టును భర్తీ చేయాలని కలలు కనసాగాడు.

ఈ విషయం తెలిసినప్పటి నుంచి సదానందం ఆనందం ఆవిరైపోయింది.

నిద్ర కరువైంది ....అలజడి మొదలయింది.

కంగారు పడుతూ బాధతో... దుఃఖంతో... మనసులో మనసు లేకుండా దేవుణ్ణి... భగవంతుణ్ణి... అందర్నీ విమర్శిస్తూ ... కోపంగా అరుస్తున్నాడు.

"వాడికి... ఆ సుబ్బారావుగాడికి ... సినిమా అవకాశం వస్తుందా?... వాడిది కోతి మొహం ... ఆ మొహానికి సినిమా ఛాన్స్ ఎందుకు వస్తుంది? ఎందుకు రావాలి?!!! ... వాడి మొహాన్ని చూసే ఇచ్చారా!!! ... చూసే ఇచ్చుంటారు.

ఏం చెయ్యాలి?... ఎలా చెయ్యాలి???... వాడు బాగు పడిపోతాడు... పైకొస్తాడు...కార్లు కొంటాడు... మేడలు కొంటాడు... ఎంజాయ్ చేస్తాడు ... జీవితాన్ని అనుభవిస్తాడు. నేనుండలేను... భరించలేను... నాకు ఇవి రాకపోయినా పర్లేదు ... వాడికి రాకూడదు ... దక్కకూడదు.

"భగవంతుడా! ... నువ్వంటే ఈ అవకాశాన్ని వెంటనే వెనక్కి తీసుకో... రద్దు చెయ్యి! ... నా కోరిక మన్నించు ... నేనుండలేను. మనశ్శాంతి లేకుండా ఛస్తాను... చచ్చిన తర్వాత కూడా దెయ్యమై తిరుగుతా. ప్రేతాత్మనవుతా. నా కోరిక మన్నించు!ప్లీజ్!!! ఈ కోరిక తీరితే నడచి ఏడు కొండలెక్కి గుండు కొట్టించుకొని ... స్వామి వెంకటేశా... నిన్ను దర్శించుకుంటాను. హుండీలో పదివేలు దక్షిణ సమర్పించుకుంటాను. వంద లడ్డూలు కొని ఇక్కడ అందరికి తల ఒక్కటి పంచుతాను. నిత్య అన్నదానానికి విరాళం ఇస్తాను. ప్రతీ రోజు నీ ఛానెల్-ఎస్వీబీసీనే చూస్తాను. ఫోన్



రింగ్‌టోన్‌గా నీ సుప్రభాతాన్నే పెట్టుకుంటాను... బార్‌కెళ్ళాలనిపిస్తే శ్రీ వెంకటేశ్వర బార్ అండ్ రెస్టారెంట్‌కే వెళతాను... సినిమాకు వెళితే వేంకటేశ, పద్మావతి థియేటర్‌లోనే సినిమా చూస్తాను! కరుణించు!!

ఓ ఏడుకొండలవాడా... వెంకట రమణా... నా కోరిక తీర్చు." అని హృదయ పూర్వకంగా వేడుకొన్నాడు. తన వేదననంతా వెళ్ళగక్కుకున్నాడు.



కొద్ది రోజుల తర్వాత సినిమా వాళ్ళు ... కొంత పెట్టుబడి పెడితే సినిమా ఛాన్స్ ఇస్తామని ... లేకపోతే ఇవ్వలేమని సుబ్బారావుకు చెప్పారు.

సుబ్బారావు ఛాన్స్ వదులుకున్నాడు.

సదానందం ఆనందానికి అంతు లేకుండాపోయింది. తన మ్రొక్కులన్నీ తీర్చుకున్నాడు. యాభైవేల వరకు ఖర్చు అయింది. పట్టించుకోలేదు.

ఎవడి పిచ్చి వాడికి ఆనందం కదా!.

ఈ లోకం ఇంతేనయా...!

గీత,రాత: Bali



అయ్యలారా! అమ్మలారా!! ఇన్నాళ్లకు నాకు జ్ఞానోదయం అయ్యింది. అదిగదిగో ఆ పార్టీయే గొప్పదని తెలిసింది. ఇక అందులో ఒకడ్ని అయిపోవాలని నాలో గుల రెకెత్తింది-పాత పార్టీఓళ్ళు సెద్దోళ్లని-ఇంతింత మీసాలున్నా గుర్తించలేదని ఇందాకే తెలిసొచ్చింది.

అందుకే ఇటుగెంతెస్తున్నాను.

వేయరూ నా మెడలో మీ పార్టీ కలర్ కండువ! ఇవ్వరూ మీ పార్టీ తీర్థం కడుపునిండుగా... ఇక ప్రజలకు చేసుకుంటాను సేవ... ఆ చేత్తో నాలుగు రాళ్ళు వెనకేసుకుంటాను. ఇక అందరి మెప్పూ పొందుతాను.




అయ్యలారా! అమాయక ప్రెజలారా!!

నేను పోలీసోడ్ని. అంటే మీ రక్షకుడ్ని. కావాలంటే మా వ్యాన్ మీద చూసుకోండి 'ప్రజారక్షణ శాఖ' అని రాసి ఉంటుంది.

దొంగలూ-దొంగ సన్నాసోళ్లూ మా చిన్న-చిన్న తమ్ముళ్ళే... అని ఆడిపోసుకుంటారు కిట్టనివాళ్ళు.

ఆళ్ళ జిమ్మడ!

చీకటి పడితే చాలు... వ్యవహారం మీద వారూ... డ్యూటీ పని మీద మేమూ చీకటిలో కలుసుకుంటాం.ఆ మాత్రం స్నేహం తప్పా చెప్పండి?



ఏం చెప్పను-చెప్పండి!

నా వెండి తెర జీవితం చెప్పాలంటే...

ఆ రోజుల్లో నా చెంగు తగిలితే చాలన్న వాడుండేవాడు.

ఓ పది పదిహేన్నేళ్ళు నా వగలే వగలు... నా అందలే అందాలు...

ఇప్పుడు అద్దంలో చూసుకుంటే జారిపోయిన నా బుగ్గలు నుంచి... అన్నీ జారిపోయాయనిపిస్తుంది.

నా వెంటపడ్డ కుర్రకారులు ఇప్పుడు ఎక్కడున్నారో పాపం!

'ఎంత ముసలి దానివయ్యావే' అని నా సహనటిని పలకరిస్తూ అడిగేను మొన్న.

'ఆహాఁ! నువ్వు పడుచుగా ఉన్నట్టు' అంది.

నా మనస్సు కలుక్కుమంది.

నా మేకప్ నన్ను రక్షించ లేదన్నమాట!



ఓ ప్రేమికురాలా!

'లవ్' అంటే మూడు గంటల సినిమాలు కాదే వెర్రిదానా! నీ ప్రేమికుడూ-నువ్వూ పైన పోయే పిట్టలు చూస్తూ, గాలిలో ఊగే పువ్వులను చూస్తూ... బఠాణీలు, పిడత కిందపప్పూ తినటం కాదే అమ్మడు! చీకటిలో శరీర భాగాలు తడుము కుంటూ స్పర్శలోని వెచ్చదనంతో, భారంగా నిట్టూర్చుతూ నువ్వే అతడై-అతడే నీవై నాలుగు కళ్ళూ ఒకటి కావడం కాదే పాప!

ప్రేమ వెంట పెళ్ళి ఉంటుంది-పెళ్ళి వెనుక సంఘం ఉంది. ఆ సంఘం నిన్ను ఆనందంగా ఆహ్వానిస్తోందో లేదో గ్రహించు. పిరికి ప్రేమికుడు కాదనీ ప్రమాణించుకో- ఏ మరిచావా... కట్నపు కోరలూ-ఎత్తయిన కడపూ, లోతయిన దుఃఖం, ఎండ్రిన్ డబ్బా... అన్నీ నీకే... నీకే.... నీకే....!



విద్యను బోధించే గురువర్యులారా!

మహా మహా మంత్రివర్యులారా!!

మా నడుములు విరగ్గొట్టే... ఈ పుస్తకాల బరువులేమిటయ్యా? గైడ్సూ, టెక్స్టులూ, స్పెషల్ నోట్సులు, మెయిన్ నోట్సులు- ఇంకా... ఇంకా... ఇంకా...!

మీకు మా వయస్సున్న మనవళ్ళు మనవరాళ్ళు లేరూ...

ఇది హింస అనిపించడం లేదూ...!

ఈ లేత వయస్సులో గంపెడు బరువులతో చెమటలు కక్కు కుంటూ... మేం పోతుంటే దాక్టర్లు నెత్తి మొత్తుకోవడం లేదూ...

అది మంచిది కాదని...

మందమైన మీ తోలుకీ-

మొద్దుబారిన మీ మెదళ్ళకీ ఎప్పుడురా స్పర్శ కలిగేది?



పాపం! సుబ్బిగాడ్ని చూస్తే జాలేస్తుంది.

వీడో కథారచయిత- తన కథలు పంపని పత్రిక లేదు. అవి పడిన దాఖలాలు లేవు. వాంతులే నయం, కాస్త ఆలస్యంగా వస్తాయి. పాపం వీడి కథలు తిరుగుటపాలో వెనక్కి తిరిగేలోగా చేతిలో పడతాయి.

ఏవో వాదాలున్నాయని విన్నాడు. వాటిని ఇంప్లిమెంట్ చేద్దామనుకున్నాడు. మొదట స్త్రీ వాదంతో మొదలు పెట్టాడు. లాభం లేకపోయింది. దళిత వాదం అందుకున్నాడు.

అదీ అంతే!

చివరకు పిడివాదంలోకి దిగాడు వరసగా నాలుగు పత్రికల్లో కథలు వచ్చాయి.

సుబ్బిగాడికీ డబ్బులు వచ్చాయి ప్రతిఫలంగా.



భ్రమరాంబ శపథం

కథ

శ్రీష్టి శేషగిరి, 9290652632

ఉదయం లేవగానే దేవుడిని దర్శించుకునే అలవాటున్న ఆనందరావు నేరుగా వంటింట్లోకి వెళ్ళాడు పొద్దున్నే లేచి. అక్కడ కనబడ్డ దృశ్యాన్ని చూసి ఒక్కసారి షాక్ అయ్యాడు.

తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు.

ఇది కలా? లేక నిజమా? అని ఆలోచిస్తున్నంతలో చురుకుమని హారతి చేతికి తగిలి ఇది నిజమే అనిపించింది.

"ఏంటి ఇది?" అని ఆశ్చర్యంగా, ఆందోళనగా అడిగాడు ఆనందరావు.

ఎదురుగా హారతి పళ్ళెం పట్టుకుని జుట్టు విరబోసుకున్న భార్యని.


"ఏంటండీ?" అంది అమాయకంగా.

"ఏంటేంటే... నా తలకాయ! ఎదురుగా నేను చూస్తున్నదేంటి?" అని అన్నాడు.

దేవుడి ఫోటోల స్థానంలో తన ఫోటోకి దండేసి వుండడం చూసి.

"ఓ అదా!... ఈ రోజు నుండి మీరే నా దేవుడు.... మీ మీదనే నా భక్తి, ముక్తి" అంది హారతి పళ్ళాన్ని అతని మొహం చుట్టూ తిప్పుతూ.

"ఒసేయ్! ఒసేయ్... ఆపవే నీ భక్తి పాడు



గాను. అయినా ఇదంతా ఏంటే? నిక్షేపంలా ఉన్న నా ఫొటోకి దండేసేవ్" అంటూ చిందులేశాడు ఆనందరావు.

"అలా చిందులేయకండి స్వామి!... ఇంకా మీకు చాలా పూజలు చేయాలి" అంది భ్రమరాంబ మరోసారి హారతి పళ్ళేన్ని తిప్పేసి.

"ఇక చాలు పూజలు! ఎందుకే నన్ను ఈ విధంగా హింసిస్తున్నావ్?" అంటూ దీనంగా వేడుకున్నాడు.

"ఏమన్నారో గుర్తులేదా?... గుర్తుచేసుకోండి అంది భ్రమరాంబ. అతని కళ్ల ముందు హారతి పళ్ళేన్ని రీళ్లలా గుండ్రంగా తిప్పి ఫ్లాష్ బ్యాక్‌లోకి తీసుకుపోతూ...

✦✦✦

"నీకు రాను రాను పతి భక్తి లేకుండా పోతుందే కాంతం" అని అన్నాడు ఆఫీసు నుండి రాగానే తనను పట్టించుకోకుండా టీవీలో మునిగిపోయినందుకు విసుగ్గా.

"ఏంటీ? నాకు పతి భక్తి లేదా? ఐతే మీకు త్వరలో నిరూపిస్తాను. నాకున్న పతి భక్తి ఎంతో" అంది ఆవేశంగా.

✦✦✦

భ్రమరాంబ మేషరాశి, వృశ్చికలగ్నం. లగ్నాధిపతి బలంగా వుండడంతో మహా మొండితనం, పట్టుదల సహజంగా ఆమెలో అబ్బాయి. కోపం వచ్చిందంటే ఆమె అపరకాళి. ఆమెను ఆపడం ఎవరితరం కాదు.

ఎప్పుడైనా భర్త నీకు అది చేతకాదా? ఇది కూడా రాదా అని అన్నప్పుడు పంతంతో పట్టుబట్టి ఆ పని చేసి చూపిస్తుంది భ్రమరాంబ. అది మంచి పనైతే సంతోషించేవాడు. కానీ ఒక్కోసారి ఆ పనులు తనను ఎంతో చిరాకు పెడుతుంటాయి.

✦✦✦

ఆనందరావుకి బాక్సింగ్ అంటే చాలా ఇష్టం. టీ.వీలో బాక్సింగ్ వస్తే కళ్లార్పకుండా చూస్తుంటాడు!

"అస్తమాను ఈ దిక్కుమాలిన కొట్లాటలు చూడకపోతే ఏ సీరియల్‌లో చూడవచ్చు కదా!" అన్నది విసుగ్గా భ్రమరాంబిక.

"ఒసేయ్ నీకేం తెలుసు బాక్సింగ్ అంటే ఏంటో... ఎంతసేపూ ఆ దిక్కుమాలిన సీరియల్స్ చూడ్డం తప్ప! అయినా బాక్సింగ్ అంటే ఏంటో ఓ గంటసేపు చూడు. అందులో గొప్పతనం తెలుస్తుంది అన్నాడు వెటకారం వ్యంగ్య స్వరంతో.

అంతే! అది విన్న భ్రమరాంబ కోపంతో బుసలు కొట్టింది. భద్రకాళిలా నాట్యం చేసింది.

"ఏంటీ... నాకు బాక్సింగ్ అంటే ఏంటో తెలీదా? నేను దిక్కుమాలిన సీరియల్స్ చూడ్డానికి తప్ప ఎందుకు పనికి రానా? ఆనందం! నీకు ఇదే నా ఛాలెంజ్! సరిగ్గా నెలరోజుల లో బాక్సింగ్ నేర్చుకుని నేనంటే ఏంటో నిరూపిస్తా !!" అంటూ భ్రమరాంబ శపథం చేసింది.

బాక్సింగ్ అంటే పప్పు రుబ్బడం అనుకుంటుంది వెర్రి



బాగులది. దానికంత సీన్ లేదులే. అనుకుని ఆ సంఘటనను ఆ క్షణమే మరచిపోయాడు ఆనందరావు. మర్నాడు ఉదయం లేచేసరికి ఇంట్లో కనిపించిన ఓ వింతను చూసి దడుచుకున్నాడు.

ఎర్రని నిక్కరు, ఎర్రని టీ షర్టు, తలకు హెల్మెట్, కాళ్లకు బూట్లు, చేతులకు గ్లౌజులు వేసుకుని ఆయాసం పేషెంట్‌లా ఎగిరెగిరి పడుతున్నదా ఆకారం.

ఎవరబ్బా ఈ వింత మనిషి? అని భయం భయంగా దగ్గరికి వెళ్లిన ఆనందరావు మొహాన ఢిడేల్ మంటూ పంచ్ పడింది.

ఆ దెబ్బకు ఆనందరావుకు పట్టపగలు చుక్కలు కనిపించాయి.

భూమి గుండ్రంగా తిరిగుతుందో లేక తానే భూమి చుట్టూ తిరుగుతున్నాడో అర్థం కాలేదాయనకు.

"ఒసేయ్!... ఒసేయ్!! ఇదేం అవతారమే దిక్కుమాలిన అవతారం అని బాక్సింగ్ దుస్తుల్లో వున్న భ్రమరాంబని చూసి చిరాకుపడ్డాడు ఆనందరావు.

"బాక్సింగ్ నేర్చుకోవాలంటే ఇలాగే నేర్చుకోవాలి. కానీ చీరలు కట్టుకుంటే బావుండదు" అంది సిగ్గుపడుతూ.

"ఓసి నీ సిగ్గు సముద్రంలో కలవా! బాక్సింగ్ నేర్చుకోమని ఎవడు చెప్పొచ్చాడే నీకు" అన్నాడు పళ్ళు పటపటా కొరుకుతూ.

"మీరే కదండీ బాక్సింగ్ అంటే ఏం తెలుసే? పిచ్చి మాలోకమా అన్నారు.

అందుకే తెలుసుకుందామనీ!" అంది ఉఁ... ఉఁ!.... అని ఎగురుతూ.

"ఒసేయ్! ఒసేయ్ ఆపవే తల్లీ! " అన్నాడు భయం భయంగా.

నలభై రోజులలో బాక్సింగ్ అనే పుస్తకం చదివి బాక్సింగ్ నేర్చుకుంటున్నానండి. అదిగో అతనే నా గురువు. నేటి నుండి నేను ఆయనకు ఏకలవ్య శిష్యురాలిని." అని ఎదురుగా మైక్ టైసన్ ఫొటోకి దండం పెట్టుకుంది.

"నీ గురుభక్తికి సంతోషించాను గానీ... ముందా బట్టలు మార్చుకుని చీర కట్టుకుని రావే. చూడలేక చస్తున్నా" అన్నాడు ఆనంద రావు దీనంగా.

"ఎలాగండీ... ఈ డ్రస్ లేకపోతే బాక్సింగ్ చేసే మూడ్ రాదు. ఏ పని చేసేపుడు ఆ పనికి తగ్గ బట్టలు వేసుకోవాలి" అన్నది.


"సరే ఆమెతో వాదించి ఎపుడు గెలిచాను గనుక అనుకుని ఆమె చేసే పనిని మౌనంగా చూస్తుండిపోయాడు.

వారం రోజులకు భ్రమరాంబ అచ్చం ప్రొఫే షనల్ బాక్సర్‌లా తయారైంది.

✦ ✦ ✦

ఓ రోజు పొద్దున ఎంతకీ కాఫీ కడుపులో పడకపోవడంతో పేగులు గోల చేసి గొంతు ఎండిపోతుంది ఆనందరావుకు.

"ఒసేయ్!... ఎంతసేపు ఆ దిక్కుమాలిన బాక్సింగేనా కాస్త నా మొహాన కాఫీ, పారేసి ఆలోచనేమన్నా వుందా?" అన్నాడు కోపంగా.



అసలే మంచి కసిమీదున్న భ్రమరాంబ ఆ మాటకు మరింత కసిగా ఆ కిట్ బ్యాగును గుద్దింది. అది వేగంగా వెళ్లి ఎదురుగా నిలబడి ఉన్న ఆనందరావుకు తగలడం, అతడు ఎగిరి అల్లంతదూరాన పడడం అన్నీ క్షణాల్లో జరిగి పోయాయి.

ఓ గంట తరువాత స్పృహలోకి వచ్చిన ఆనందరావు "ఏం జరిగిందే"అని భ్రమరాన్ని అడగ్గా "అబ్బే! ఏమీ లేదండీ! కాఫీ కడుపులో పడక కళ్ళు తిరిగి పడిపోయారు అంతే." అని తెలివిగా కవర్‌చేసింది.



కొంత సేపటికి అసలు విషయం అర్థమ యిన ఆనందరావు- "భ్రమరం! నీవు ప్రపం చంలోనే నెంబర్‌వన్ బాక్సర్‌వి. దయచేసి ఇక బాక్సింగ్ ప్రాక్టీస్ ఆపేసెయ్." అంటూ వేడు కున్నాడు దీనంగా.

అలా ఆమె పట్టుదల గెలిచింది. ఆ గండం గడిచింది.

✦ ✦ ✦

"ఏమండీ ఏంటీ ఇంకా ఫ్లాష్‌బ్యాక్‌లోనే ఉన్నారా? పదండి త్వరగా స్నానం చేసి వస్తే మీకు కుంకుమపూజ చేస్తానండి" వినయంగా.

"నాకు కుంకుమ పూజ చెయ్యడమేంటే? నేనేమన్నా దేవతనా? దేవుడినా?" అన్నాడు చిరాకు పడుతూ.

"నాకు మీరే పతి దేవుడండీ. అందుకే ఏ పూజ అయినా మీకే చేస్తాను." అంది అతనికి మరోసారి హారతి ఇస్తూ.

"ఒసేయ్!... నువ్వు ఇలా పదినిమిషాలకో సారి హారతిస్తుంటే నా మొహం మాడిపోయిన పెసరట్టులా తయారవుతుందే" అన్నాడు మొహానికి అంటిన మసిని తుడుచుకుంటూ.

"మరి ఇకనైనా ఒప్పుకుంటారా? నాకు పతి భక్తి ఉందనీ!" అంది నవ్వుతూ

"ఆఁ! ఒప్పుకుంటానే తల్లీ! నన్ను వదలవే" అంటూ వేడుకున్నాడు ఆనందరావు ఇక ఎప్ప టికీ భ్రమరాంబని తక్కువచేసి మాట్లాడ కూడ దని నిర్ణయించుకుని.



అభినందనలు.

హాస్యానందం బాలిగారి ప్రత్యేక సంచిక రూపొందిస్తున్నందుకు బాలిగారికి, హాస్యానందానికి నా అభినందనలు.

-బి.వి.సత్యమూర్తి, కార్టూనిస్ట్

బాలి గారి గుభాళింపు... తాళింపు...

-హరి



మా ఇసాకపట్నం పెందుర్తి పెంకుల గ్రంధాలయంలో పుస్తకాలు చదువుతుండగా... పక్కనే వున్న ఇంట్లోంచో... షాపులోంచో ఎస్పీబాలు, పి.సుశీల గానం ఆల్ఇండియా రేడియోలో కమ్మగా వినిపించేది. అదలా వింటూ, ఈ పుస్తకాలలా చదువుతుంటుండగా నలుపు తెలుపులు, రంగులకలల్లో 'బాలి' గారి బొమ్మల గుభాళింపు తెగ ఆస్వాదించాను. దేవుడు (ఉంటే...గింటే) ప్రసాదించిన ఇంత అందమైన అద్భుతమైన జీవితంలో ఒకానొక ప్రశాంత వాతావరణంలో ఆయన బొమ్మల్ని ఆసాంతం ఆస్వాదించాను.

ఆయనలా బొమ్మలు గీయాలని నేనెప్పుడూ అనుకోలేదు. నాలాగే నాకు వచ్చినట్లు, నచ్చినట్లు గీయాలనుకున్నాను.

హైదరాబాద్ హిపోక్రాటిక్ జీవితంలో (ఏంటి విశాఖపట్నంలో హిపోక్రాటిక్స్ లేరా? ఏంటి?) గాలి మాటల విచిత్ర కబుర్లలో ఏది నిజమో, ఏది అబద్దమో తెలియని అయోమయంలో... వృత్తిని...స్వశక్తిని...నడచివచ్చిన దారిని... రూట్స్‌ని మరచిపోని సరదాయైన చిత్రకారుడు, కార్టూనిస్టు అయిన బాలి గారిని కలుసుకున్నాక..నా మార్గం నాకు క్లియర్ అయింది.

పనిచేయడం...ఎప్పటిపనిని అప్పుడే క్లియర్‌చేయడం... శుభ్రంగా వుండటం మనం ఆయన నుంచి నేర్చుకోదగ్గ మంచి విషయాలుగా నాకు అనిపించాయి.

ఆయన మాట్లాడుతుంటే కథ చెపుతున్నట్లుగా ఉండి మన కళ్ల ముందర దృశ్యాలు కదులుతుంటాయి. ఒక పక్క మనం ఆయన మాటల గు'బాలి'ంపును ఆస్వాదిస్తుంటే... ఎందరెందరో మహానుబావులకు తాటాకులు కట్టి...తాళింపు పెట్టేస్తారు. (విశాఖపట్నం భాషలో గాలితీసేస్తారు).

బాలి గారి కార్టూన్లలో నాకు నచ్చిన కార్టూన్లు 'కులవ్యవస్థపై' వేసిన కార్టూన్లు కొన్ని. ఇంకా సినిమాలపై ఆయన సెటైర్లు నవ్వుతెప్పిస్తాయి. ఈ మధ్య ఆయన రాస్తున్న కథలు కూడా చదువుతున్నాను. అవి కూడా చాలా బాగున్నాయి. కార్టూనిస్ట్ శేఖర్‌గారు నేను ఓసారి సీతాఫల్‌మండిలో వున్న వారింటికి వెళ్లినపుడు ఆయన స్వయంగా చేసి ఇచ్చిన 'సున్నివుండలు' లాగ!



బాలిగారికృషికి నమస్కారాలు!



బాలి బొమ్మలు చూస్తే ఆయనకు లొంగని 'పాళీ' ఉంటుందా అనిపిస్తుంది. రకరకాల రేఖా విన్యాసాలతో చూపు తిప్పుకోకుండా చేస్తాయి. ఆయన చేతి రాత (గీత) అంత అందంగా ఉంటుంది మరి!

నేనెప్పుడో ఆంధ్రప్రభ చిన్నారి పుస్తకంలో బాలిగారి 'చందు' కి అభిమానిని, అలా బాలి బొమ్మల్ని చూస్తూ రోజు రోజుకి అభిమానం పెరిగిందే కానీ తరగలేదు.

ఒక కూర్చున్న బొమ్మ, ఒక నిల్చున్న బొమ్మలతో కార్టూన్లు వేస్తూ నేనూ కార్టూనిస్టనే అనుకుంటున్న సందర్భంలో 'బాలి కార్టూన్ల పుస్తకం' నా కంట పడి చెంప ఛెళ్ళుమనిపించి... కాలర్ పట్టుకుని గీతలంటే ఇలా ఉండాలి... ఫోజులంటే అలా ఉండాలి... సందర్భానుసారంగా భావ ప్రకటన ఇలా చేయాలి– అని ఓనమాలు నేర్పింది. ఆయన చిత్రాల వెనుక ఎన్నో ఏళ్ళ కఠోర శ్రమ ఉంది. అయినా ఇంకా ఆయనకు బొమ్మలపై దాహం తీరలేదు. నిత్య విద్యార్థిలా వినూత్న శైలిలో బొమ్మల్ని ఎప్పటికప్పుడు మనకు అందిస్తూ... ఆయన బలమైన గీతలతో కట్టి పడేస్తూనే ఉన్నారు.

బాలిబొమ్మల్ని స్ఫూర్తిగా తీసుకుని బొమ్మలు వేస్తున్న ఎంతోమందిలో నేనూ ఒకడిగా బాలిగారి కృషికి చేతులెత్తి నమస్కారాలు చెబుతూ.... -నందు



అజయలక్ష్మిరాజు

పెళ్ళిఫోటో

సీరియల్

"ఏమిటీ మౌనం! ఎక్కడున్నావ్?"

"లేడీస్ హాస్టల్ దగ్గర పనుండి వచ్చాను."

"లేడీస్ హాస్టల్ దగ్గర నీకేం పని?"

"ఇక్కడయితే హాస్టల్‌లోంచి బయటకు వెళ్ళే అమ్మాయిలు, లోపలికి వెళ్ళే అమ్మాయిల అందాలు ఆస్వాదించవచ్చునీ!" అక్కసుగా అన్నాడు.

"నోరుముయ్యి! నీకంత లేదుగానీ. రేపు మీ పెద్దక్కయ్యగారి ఊరికి మనం వెళుతున్నాం. మా ఇంట్లో పర్మిషన్ ఇచ్చారు. నువ్వా మీ నాన్న అమ్మల పర్మిషన్ తీసుకుని రెడీగా బస్టాండుకు వచ్చెయ్యి. నేనిటునించి ఇటే వచ్చేస్తాను."

"మా పెద్దక్కయ్య వారి ఊరు పల్లెటూరు రెండుకిలో మీటర్లు నడవాలి."

"నాకు తెలుసు! రేపు బస్టాండు కొచ్చెయ్యి" ఫోన్ పెట్టేసింది శ్రీవల్లి.

✦✦✦

"ఇక్కడ ప్రేమించడం నేర్పబడును."

"ఇదేమిటండీ ఈ బోర్డు. ప్రేమించడం నేర్ప డమేమిటి?" ఆటో దిగగానే బోర్డు చదివి ఉలి క్కి పడి అడిగాడు హనుమంతు కళావతిని.

"అంత ఆశ్చర్యం దేనికి? ఇక్కడ జాతకం చెప్పబడును, వాస్తు సలహాలు చెప్పబడును, 10వ తరగతి పిల్లలకు ట్యూషన్ చెప్పబడును, టైపు నేర్పబడును, కుట్లు నేర్పబడును, సంగీతం, డ్యాన్స్ నేర్పబడును- ఇలాంటి బోర్డులు చూడలేదా? అలాగే ఇదీనూ 'ప్రేమించటం నేర్పడమంటే... ద్వేషించటం మాన్పించటమే కదా!" అంది కళావతి వేదాం తిలా ఫేసు పెట్టి.

"అంటే ఇది క్రిస్టియన్స్ బోధనలకు సంబం ధించిన స్కూలా?"

"క్రిస్టియన్స్ తప్ప మిగతావారు ప్రేమిం చటం నేర్చుకోకూడదా అలాంటి మతాలకు, కులాలకు అతీతమైనదీ ఇన్‌స్టిట్యూట్. లోపలికి రండి! చూద్దురుగాని!" అంటూ కదిలింది కళా వతి. మంత్రముగ్ధుడైనట్టు ఆమె వెనకే నడి చాడు హనుమంతు.

అదసలు ఆఫీసులా లేదు. డబుల్ బెడ్‌రూం ఫ్లాటులా వుంది. యల్ షేపులో వున్న హాల్లో సోఫాలు, దివాన్, కొన్ని కుర్చీలు ఓ టేబుల్ పద్ధతిగా అమర్చి వున్నాయి.

గోడలమీద యువజంటల ల్యామినేషన్ ఫోటోలు ఓ యాభై వరుసగా తగిలించి వున్నాయి.

ఓ అరవై అయిదేళ్ల వృద్ధుడు, అరవైఏళ్ళ వృద్ధురాలు సోఫాలో కూర్చుని ఏదో విషయం తర్జన భర్జన పడుతూన్నట్టు తెలుస్తోంది.

"ముసలాళ్ళను కాపలా పెట్టి ఎక్కడికో వెళ్ళి నట్టున్నారు" అన్నాడు హనుమంతు.


"అదే మరి! తెలుసుకోకుండా మాట్లాడడ మంటే. ఈ ఆఫీసుకు వీళ్ళే అధిపతులు" అంటూ- "నమస్కారమండీ దేవేంద్రగారూ! నమస్కారమండీ ఆర్తి అగర్వాల్‌గారూ!..." అంటూ చేతులు జోడించింది కళావతి.

"ఓ! కళావతీ! రామ్మా...బావున్నావా?"

"ఇతనెవరు?... నీ లవ్వరా?... ఏమిటమ్మా వుండుండి ఇలాంటివాడిని సెలెక్టు చేసు కున్నావు... మరీ ముచ్చు మొహంలాగా లేదూ..."

"ఏం దేవా! నీవేమంటావ్?" అంటూ ముస లావిడ దేవేంద్రను "దేవా!' అని సంబోధిస్తూ

జరిగిన కథ: పావని తల్లి పావనిని చాలా కట్టుదిట్టంలో ఉంచు తుంటుంది. ఆమె అన్నయ్యకు మాత్రం చాలా స్వేచ్ఛనిస్తుంటుంది. తల్లి ఇద్దరిపట్ల చూపుతున్న తేడాని భరించ లేకుండా వుంటుంది పావని. పావని తండ్రి సుబ్బారావు ఒక నవల రాసి కూతురికి ఇస్తాడు. ఆ నవల కథాంశం తన ప్రేమకథేనని చెప్తాడు. అది పావని చదవడం మొదలెడుతుంది. -ఇక చదవండి





తనను కించపరచినట్టు డైలాగు లేస్తుంటే ఒళ్ళు మండింది హనుమంతుకు.

"అలాంటిదేం లేదు ఆంటీ! ఈ అబ్బాయి నా లవ్వర్ కాదు. జస్ట్ ఫ్రెండ్ అంతే!"

"ఆ... ఈ రోజు ఫ్రెండూ... రేపు లవ్వరూ... ఏం దేవా?" అంటూ మళ్ళీ బోసినోరు వెళ్ళబెట్టి నవ్వింది ఆర్తిఅగర్వాల్.

"నువ్వుండు ఆర్తీ! ఇంతకీ ఏం పనిమీద వచ్చావమ్మా కళావతీ! ఇలా కూర్చో! అబ్బాయ్ నువ్వూ కూర్చో!" అన్నాడు దేవేంద్ర వణుకుతున్న గొంతుతో.

కళావతి కుర్చీలో కూర్చుని టేబుల్ మీదున్న ఫైళ్ళని ఒకసారి పరికించి, హనుమంతు వైపు తిరిగి కూర్చోమన్నట్లు సైగ చేసింది.

దేవేంద్రను, ఆర్తి అగర్వాల్‌ను ఓసారి పరికించి చూశాడు హనుమంతు.

దేవేంద్ర జీన్స్‌ప్యాంట్, టీషర్టు వేసుకుని తలకు నల్లటి రంగేసుకుని, కళ్ళకు మంచి గాగుల్స్ పెట్టుకుని టిప్పు టాపుగా వున్నాడు. మనిషి మాత్రం వంగిపోయి, ముసలితనం మీదపడి, గొంతు వణుకుతున్నా ఈ వయసు శరీరానికే కానీ మనసుకు కాదు అన్న భావం అతని మాటల్లో ప్రస్ఫుటమౌతోంది.

ఆర్తి అగర్వాల్ కూడా పంజాబీడ్రెస్ వేసుకుని, జుట్టు అలా వదిలేసింది. ముఖాన సన్నగా బొట్టు, పెదవులకు లేతరంగు లిప్‌స్టిక్, మెడలో సన్నటిచైను వేసుకుని ఎంతో హుషారుగా వుంది.

"వీళ్ళ పేర్లేంటి విచిత్రంగా వున్నాయి?" అడిగాడు హనుమంతు కళావతిని.

"మా పేర్ల గురించి అడుగుతున్నావా? అదేదో మమ్మల్నే అడగొచ్చుగా! అమ్మాయితో ఎందుకు గుసగుస?" అంటూ నవ్వేశాడు గట్టిగా దేవేంద్ర.

"అమ్మో! ముసలాడికి చెముడు లేదు" మనసులో అనుకున్నాడు.

"మనకు చెముడుందనుకున్నాడు డార్లింగ్!" అంది మళ్ళీ ఆర్తి అగర్వాల్

ఆవులిస్తే పేగులు లెక్కపెట్టేలాగున్నారు ముసలాళ్ళిద్దరు అనుకుని సర్దుకుని కూర్చుని కళావతివైపు చూశాడు 'విషయం నీవే అంతా వివరించి చెప్పు' అన్నట్టు.

"ఈ అబ్బాయి పేరు హనుమంతు. ఇతను ప్రేమించాలనుకుంటున్నాడు..." అంది ఉపోద్ఘాతంలా కళావతి.

"అలాగా! ఎవరిని!" అడిగాడు దేవేంద్ర.

"తెలీదు."

"అంటే ఇంకా ఎవరిని ప్రేమించాలో డిసైడ్ చేసుకోలేదా?... అయితే ఓనమాల దగ్గర్నించి నేర్పించాలన్నమాట. సరిసరి! అమ్మాయ్ కళావతీ! ఈ అబ్బాయికి మా ఫీజు గురించి వివరాలు చెప్పావా?" అడిగాడు ఇంద్ర.


"లేదు అంకుల్! మొత్తం వివరాలు మీరే చెప్పండి! హనుమంతుగారూ!... మీకికనించి దేవేంద్ర, ఆర్తి అగర్వాల్‌గారు ప్రేమించటం నేర్పించి మీ ఆశయసాధనకు కృషి చేస్తారు. నాకు టైం లేదు. నేను ఇంటికి వెళ్ళాలి" అంది కళావతి.

"అప్పుడే వెళ్ళాలా! ఇంకాసేపుండరాదూ! మీ అమ్మగారి పర్మిషన్‌తోనేగా వచ్చావు...." అన్నాడు హనుమంతు.

"ఆహా! మీ విషయమంతా వివరంగా చెప్పి మరీ పర్మిషన్ తీసుకొచ్చాను" అంది కళావతి.

"అలాగా!అయితే పెద్దావిడకు నామీద దురభిప్రాయం పోయినట్టేనన్నమాట!" ఆనందంగా అన్నాడు హనుమంతు.

"సరేలెండి! అసలు విషయం చెబితే పడిపోతారు. బూచాడి ఫేసూ వాడూ. వాడికి మళ్ళీ ప్రేమా దోమా కావాలిట! అనవసరంగా నువ్వు రిస్కు తీసుకోకు.' అంటూ తిడుతుంటే నచ్చ చెప్పి అరగంటలో వచ్చేస్తానంటూ వచ్చాను" అంటూ హనుమంతు ముఖకవళికలు గమనించకుండా బయటకు వెళ్ళిపోయింది.



హనుమంతు మొహం కందగడ్డలా మారిపోయింది.

"కూల్‌డౌన్ మై బోయ్! కూల్‌డౌన్" అంటూ దేవేంద్రగారు హనుమంతు చేయి నొక్కి సోఫాలో కూర్చోబెట్టారు.

ఆర్తి అగర్వాల్ మంచినీళ్ళు తెచ్చి త్రాగమంది. గటగట త్రాగేశాడు హనుమంతు.

దేవేంద్ర, హనుమంతు వీపు నిమురుతూ–

"నువ్వేం వర్రీ అవకు, నవ్విన మిరపచేనే పండుతుంది."

"మిరపచేను కాదు డార్లింగ్... నాపచేను" అంటూ అందించింది ఆర్తి.

"ఏదో ఒకటిలే నువ్వడ్డు రాకు. ఓడలు బండ్లవుతాయి, బండ్లు మోపెడ్‌లవుతాయి..."


"అదిగో మళ్ళీ తప్పు సామెత" అంటూ అందివ్వబోయింది ఆర్తి.


"ష్! నువ్వడ్డు రాకు. చూడు హనుమంతూ! ప్రేమ చాలా గొప్పది. ప్రేమించి పెళ్ళి చేసుకోవాలనుకున్న నీ ధ్యేయానికి నా జోహార్లు. ముందు ప్రేమకథ చెబుతాను విను" అన్నాడు దేవేంద్ర.


"మీ ప్రేమకథనా?" ఆశ్చర్యంగా అడిగాడు హనుమంతు.

"అవును! మధ్యలో ప్రశ్నలెయ్యక విను. నేను, ఆర్తి చిన్నప్పటినించి పక్క పక్క ఇళ్ళల్లో వున్నాం. జోరీగ... జోరీగ... అంటూ పాటలు పాడుకుంటూ ఆడుకుంటూ వయసొచ్చాక ప్రేమించుకుని... ప్రపంచమంతా నువ్వే అని పాడుకున్నాం.

మా ప్రేమను పెద్దవాళ్ళు అర్థం చేసుకోకపోవటంతో మేమొక నిర్ణయానికొచ్చాము. ఆర్తి, నేను కూడబలుక్కుని వచ్చిన సంబంధాలన్నీ తిప్పికొట్టాము. దాదాపు అయిదారు సంవత్సరాలు అలాగే చేశాము. ఈలోగా అందరికీ మేమిద్దరం ప్రేమించుకున్నామన్న సంగతి ప్రాకిపోయి సంబంధాలు రావటం మానేశాయి. ఇప్పటికైనా మా యిద్దరికీ పెళ్ళి చెయ్యండని పెద్దవాళ్ళను బ్రతిమిలాడాము. వాళ్ళు ససేమిరా చెయ్యమన్నారు. **(సశేషం)**





అత్తాకోడలీయం


మేం సుబ్బరంగా గదిలో పడుకున్నామన్న
మాటేగాని అక్కడయ మా అత్తగారు బయట
గుమ్మంలో పడుకోని తెల్లార్లూ దగ్గుతుంది.
ముసలిదాన్ని ఆరుబయట బయటుంచామన్న
అపవాదే గాని లోన
మాకేం నిద్రపట్టుతుంది
చెప్పు


మీ మావగారు లెక్కలమాస్టారు. రొట్టె గుండ్రంగా
వృత్తలేఖినితో గీసినట్టుండాలి. నువ్వు ఇండియా మ్యాపులు
చేస్తున్నావు. ఆయన


మా కాంతం చాలా అదృష్ట
వంతురాలే వదినా-
పెళ్ళయి ఇలా కాపురానికి వచ్చిందో
లేదో అత్తగారు
టుటుక్కుమంది-


మీ అబ్బాయి
కోడలూ చిలకా
గోరింకల్లా
ఉన్నారే!
ఉండకేం చేస్తారు - ఇటు
ఈ కొంపలో నేనే కాకిని.
ఏకాకిని.


చూసారా! మీ అమ్మ ఎంత గడుసుదో-
మెత్తగా ఉంటే.... త్వరగా
తినేస్తామనే ఈ సున్నుండలు.....
లేదండోయ్-




నవ్వుల రారాజు

ఫ్లాష్‌బ్యాక్

చార్లీచాప్లిన్ దగ్రేట్!

విష్ణుభొట్ల రామకృష్ణ

ఫోన్: 9 4 4 0 6 1 8 1 2 2



అనుకున్న ప్రకారం మాడేఫీలేను హాలీవుడ్ హోటల్‌లో కలిశాడు చాప్లిన్. ఇద్దరూ కలిసి తమ తమ జీవిత విశేషాలను గురించి, సినిమాల గురించి, అనేక విషయాల గురించి పిచ్చాపాటీ మాట్లాడుకున్నారు. ఎంతసేపు గడచినా తాను తప్ప మరో అతిథి అక్కడ కనిపించలేదు. అలా గంటసేపు గడచిన తర్వాత డిన్నర్ చేద్దామా అని మాడేఫీలే ఆహ్వానించగా సరేనన్నాడు చాప్లిన్.

ఇంత అందమైన సుందరి. గొప్ప నటి. అతనొక్కడినే ఆ విందుకు ఆహ్వానించడం చాప్లిన్‌ను ఆశ్చర్యానికి గురి చేసింది. ఇంత అందమైన ఈమె తనను ఒక్కడినే ఎందుకు పిలిచింది? ఈమెకు తనపై మరో ఆలోచన ఏమైనా ఉన్నదా...? లేక మరేదైనా కారణమా...? అని పరి పరి విధాలుగా ఆలోచించసాగాడు చాప్లిన్.

కానీ మాడేఫీలే ఎటువంటి ఆలోచనలు లేక ఏమీ పట్టనట్లు తనలో తాను విందును ఆరగించసాగింది. ఆమె అలా పట్టనట్లు ఏమీ మాట్లాడ కుండా విందు చేయడం చాప్లిన్‌కు ఆశ్చర్యాన్ని కలిగించింది.

విందుకు ఎవరిని ఆహ్వానించకపోవడం... ఒంటరిగా ఎదురెదురుగా కూర్చుని విందు చేయడం ఎందుకు? అనే ఆలోచనలతో మాడేఫీలే ఆలోచనల్ని తెలుసుకోవాలన్న కుతూహలం ఎక్కువ కాసాగింది.

ఎక్కువసేపు ఉండలేక మనం ఇలా ఒంటరిగా కూర్చుని విందు చేయడం గమ్మత్తుగా ఉంది కదూ! అంటూ తన కుతూహలాన్ని వ్యక్త పరిచాడు చాప్లిన్.

అతని మాటలకు ఆమె ఎటువంటి సమాధానం చెప్పక ఒక చిరు నవ్వునే సమాధానంగా ఇచ్చింది. ఆమె చిరునవ్వు చాప్లిన్‌ను మరింత ఆలోచనలు కలిగించే విధంగా మారాయి.

మౌనం అర్థంగీకారం అన్నట్లు ఆమె చేష్టలు చూస్తుంటే ఆమె తనని ఇష్టపడుతున్నట్లు భావించాడు చాప్లిన్.

ప్రేమలో తాను అనేకసార్లు విఫలమయ్యాడు. ఈసారి ప్రేమే తనని

వెతుక్కుంటూ వచ్చింది. కాబట్టి వచ్చిన ఈ అవకాశాన్ని వదులుకోవడానికి ఇష్టపడని చాప్లిన్ వెంటనే మాడేఫీలేతో విందు ముగిసిన తర్వాత వినోదం కోసం ఏదైనా నైట్‌క్లబ్‌కు వెళ్ళి కాసేపు గడుపుదామా! అన్నాడు చాప్లిన్.

అతని మాటలకు ఒక్కసారిగా కంగారుపడ్డ మాడేఫీలే "అబ్బే! నాకు అటువంటి ఉద్దేశ్యం లేదు. నాకు రావడానికి కుదరదు. ఎందుకంటే నాకు రేపు ఉదయం ఓ చిత్రానికి రిహార్సల్స్ ఉన్నాయి. వాటిని కచ్చితంగా చేయాలి. లేకుంటే డైరెక్టరు ఒప్పుకోద"ని చెప్పింది.

ఆమె నోటి నుండి ఊహించని మాట వినేసరికి చాప్లిన్ ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు. అంటే ఈమెను నేను తప్పుగా అర్థం చేసుకొన్నానా? లేక ఈమెకు తానంటే ఇష్టంలేక అలా చెబుతోందా? అనే విషయం అర్థం కాలేదు.

అతని మెదడు కాసేపు మొద్దు బారింది.

చాప్లిన్ అసలే బిడియస్తుడు మరియు చిన్న వ్యతిరేకమైన మాటలకు తీవ్రంగా చలించే వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి కావాలంటే ఫీల్ మాటలకు అతని అహం దెబ్బతిన్నది. మనస్సు చాలా చిన్న బుచ్చుకున్నాడు. ఆ అవమానాన్ని భరించలేక మౌనంగా భోజనం ముగించాడు చాప్లిన్.

ఈ సంఘటనతో ఇద్దరి మనస్సులో అంతర్మథనం ప్రారంభమైంది. తప్పుమాట మాట్లాడినామా? అనే అనుమానం కలిగింది. ఎదుటి వ్యక్తి మనస్సును గాయ పెట్టామా? అని ఆలోచించసాగారు. అలా కొంతసేపు మౌనం వారి మధ్య రాజ్యం ఏలింది.



ఆ విషాద సమయాన్ని మార్చడానికి ఫీలే "మీరు ఎంతో గొప్పగా, ఆనందంగా, ఉల్లాసంగా గడపడానికి ఈ సాయంత్రం వచ్చారు. కాని మీరు ఆ ఆనందాన్ని నా నుండి పొంద లేదనుకుంటాను" అని అన్నది.

ఆ మాటలకు "అలాంటిది ఏమీలేదు. నేను ఎటువంటి ఆలోచనలతో, ఊహలతో రాలేదు. నాకు మీరు ఇచ్చిన విందు చాలా సంతోషాన్ని కల్గించింది'' అని సమాధానమిచ్చాడు చాప్లిన్ అసహనంగా.

"మీకు ఈ సందర్భంలో ఓ విషయం గుర్తు చేయనా" అని అడిగింది ఫీలే.

"ఏమిటది" అన్నాడు చాప్లిన్.

"సరిగ్గా మూడు నెలల క్రితం ఇదే రోజు మీరు న్యూయార్క్‌లో ఉన్నారనుకుంటాను" అన్నది.

"ఔను మూడు నెలలనాడు న్యూయార్క్‌లో ఇదే హోటల్‌లో ఉన్నాను" అన్నాడు చాప్లిన్.

"అదే రోజు మీ మిత్రురాలు ఇదే పాప్ హోటల్‌లో నన్ను విందుకు ఆహ్వానించారు మీకు తెలుసా?'' అని అడిగింది.

(సశేషం)





యమగోల

కథ

ఎన్.వి.ఎస్.నాయుడు,
9246837689

అది యమలోకం....

అప్పుడే యముడొచ్చి సింహాసనంలో కూర్చుని చిత్రగుప్తుడు, భటులు తన రాకని పట్టించుకోకుండా సొల్లు కొట్టుకోవడం చూసి, "యముండా !" అంటూ కోపంగా అరిచాడు.

చిత్రగుప్తుడు ఉలిక్కిపడి– "ప్రభూ.....క్షమించండి... తమరింకా రాలేదనుకుని" అన్నాడు.



"అనుకొందువు... అనుకొందువు... ఇంతకీ భటులతో ఏమిటా ముచ్చట్లు?"

"మ్యా.. మ్యా.. మ్యా..." అంటూ నీళ్ళు నములసాగాడు చిత్ర గుప్తుడు.

"ఏమి నీళ్ళు నములుచున్నావు...? నీకీ మధ్య..." అంటూ ఏదో అనబోయి అప్పుడే భూలోకమునుండి ఖాళీగా తిరిగివస్తున్న భటులను చూసి– "ఓరీ భటులారా!...రిక్తహస్తములతో వచ్చినారేల? పాపులెక్కడ? భూలోకమున పాపులే కరువైతిరా...ఏమి?" గర్జించాడు యముడు.

"అదేమియూ కాదు ప్రభూ!" అన్నారు భటులు భయంభయంగా.

"మరేమైనది?... చిత్రగుప్తా!... నీవైన చెప్పుము!"

"అది ప్రభూ... అదీ..." అంటూ నసుగుతూ– "భూలోకమున వృద్ధులకు.. యువకులకు తేడా తెలియడం లేదట ప్రభూ... మన భటులు తిరిగి తిరిగి ఇలా రిక్త హస్తములతో...."

యముడు బుగ్గన వేలు పెట్టుకుని–

"ఏమి ఆశ్చర్యం! భూలోకమున అమృతమేమైనా?!!...."

"అక్కడ అమృతం ఎందుకుంటుంది? ఆల్కహాల్ తప్ప!" అన్నాడు భటుల మధ్యలోంచి భూలోకవాసి సత్తిబాబు.

"చిత్రగుప్తా!... ఎక్కడనుండో 'ఆ...ల...క...హా...లు...' .అనే వింత శబ్దం వినిపించింది.. ఎవరదీ....?"

"ఎవరునూ లేరు ప్రభూ!" అని సత్తిబాబుని స్తంభం చాటుకు తీసుకొనిపొమ్మని భటులకు సైగ చేసి "అది అమృతం కాదు ప్రభూ... అది...అదీ." అంటూ కంగారులో చేతిలోని సీసా క్రింద పడేసాడు.

"ఏమిటా శబ్దం! ఏమిటది క్రింద పడవేసితివి?"

"ప్రభూ!...ఇక మీవద్ద దాయనేల? తలకు రంగులు వేసుకొనే ప్రక్రియ ఎవరు కనిపెట్టిరో ఏమో గానీ భూలోకమున యువతీ, యువకులు మొదలుకొని వృద్ధుల వరకూ ఈ రంగులే వేసుకొనుచున్నారు. అందువలన మన భటులకు వృద్ధులెవరో... యువకులెవరో తేడా తెలుసుకొనుట కష్టముగా ఉన్నది?"

"ఏమది? విచిత్రముగానున్నదే! అయినచో... ఇప్పటి వరకూ ఈ విషయము మా దృష్టికి ఎందుకు తీసుకుని రాలేదు? నా లోకమున నాకు తెలియకుండానే.. ఇంత కథ నడుస్తున్నదన్న మాట. ఈ విషయం మాతండ్రి గారైన బ్రహ్మ గారి సుముఖమునకు తీసుకునివెళ్ళి నిన్ను కత్తికో కండగా కోయించి... నూనెలో సలసలా వేయించి... కాకులకూ... గ్రద్దలకూ...."

'చెప్పుకొనిన చెప్పుకొనుము! నాకు భయమను కుంటిరా? మీరు నన్నేం చేయలేరు... మొన్ననే బ్రహ్మకి పేద్ద రంగు సీసా ఇచ్చి వచ్చాను... తెల్లగా ముగ్గుబుట్టలా ఉండే జుట్టు కాస్తా నల్లగా నిగనిగలాడుతూ తయారైంది...' అంటూ నోట్లో గొణుక్కున్నాడు చిత్రగుప్తుడు.

"ఏమిటదీ!... నోటిలో ఏమో గొణుగుకొనుచున్నావు??"

"ఏమియునూ లేదు ప్రభూ... క్షమించండి అంటున్నాను...మొదటి తప్పుగా కాసి కర్తవ్యం ప్రభోదించండి అంటున్నాను."

"అహో! చిత్రగుప్తా .....శరణన్నవారిని దండించమదీయ దండము ఒప్పుకొనుటలేదు...ఇప్పుడేమి చేయుట?"

"చేయునదేమున్నది? తలకు వేసుకునే రంగులు తయారు చేయు కంపెనీలు మూయించడమో... లేక తయారైన ఆ మందులు జనాలకు చేరకుండా తస్కరించడమో.... మనకు తెల్సిన విద్యలే కదా?" అన్నాడు సత్తిబాబు స్తంభం చాటు నుండి ముందుకొచ్చి.

"అప్రస్తుతం! ఎవరీ అసందర్భ ప్రేలాపి..... చిత్రగుప్తా! ఎవరీతడు మాకే ఎదురు సమాధానం చెప్పుచున్నాడు."

"ప్రభూ! అదీ... అది..."

"యెహే... అదీ... అదీ... అంటూ వచ్చిన దగ్గర్నుంచి నీకు నసగటమే సరిపోతుంది... చెప్పేయ్....ఊరికే భయపడి పోతావెందుకు?"

"నువ్వూరుకోవయ్యా మగడా!" అని సత్తిబాబుని వారించి–

"ఇతని జుట్టు పూర్తిగా మెరిసిపోయినది ప్రభూ! ముసలి వాడేమోననుకుని మన భటులు పొరబాటుపడి తీసుకొచ్చేసారు."

"అహో! చిత్రగుప్తా... తప్పుపై తప్పు చేసి నాకు రక్తపీడనం తెప్పించుచున్నావు.... .ఇప్పటి వరకూ ఈ విషయం నాదృష్టికి ఎందుకు తీసుకుని రాలేదు?"



"రక్తపీడనమా! ఓహో బీపీయా... ఇది మీ లోకములో కూడా ఉందన్నమాట. మరి సుగరో...!?" అంటూ ఫేస్ లో క్వశ్చన్ మార్క్ పెట్టాడు సత్తిబాబు.

"ఉండవయ్యా! ఈ గండంనుంచి నేనెలా బయటపడాలా అని ఆలోచిస్తుంటుంటే... మధ్యలో నీ గోలొకటి." అన్నాడు చిత్రగుప్తుడు.

"సుగరా... అదియేమి... ఏమిటీ విచిత్ర పదములు? చిత్రగుప్తా... ఇతని నోర్మూయించెదవా... లేక మదీయ గదాదండము తీసి....అహ్హా...అహ్హా?" అంటూ దగ్గరసాగాడు యముడు.

"కోప్పడకండి ప్రభూ మరలా మీకు బీపీ పెరిగి ఆయాసం వచ్చేస్తుంది.".

"ఈ నక్కవినయాలకేమీ తక్కువలేదు. ఇప్పుడింతకీ ఏమి చేయాలో చెప్పి చావు." అన్నాడు యముడు అసహనంగా.

"అదే అర్థం కావడం లేదు ప్రభూ!" అంటూ కిరీటం తీసి ప్రక్కన పెట్టి బుర్ర గోక్కోసాగాడు చిత్రగుప్తుడు.

"నీకు ఏమియునూ అర్థం కాదు. చేయవల్సినదంతా చేసేసి... ఇప్పుడు కబుర్లు చెప్పుచున్నావు! నీకును వయసైపోవుచున్నది కదా!" అంటూ చిత్రగుప్తున్ని పరికించి చూసి– "మొన్నటి వరకూ తెల్లగా మెరుస్తూ ఉండే నీ జుట్టు ఇప్పుడు నల్లగా నిగనిగలాడుతున్నదేమి?"

"మొన్ననే ఈ ముసలాడు మీ భటులకు నన్ను తోడిచ్చి భూలోకమునకు

పంపించి రంగుసీసాలు తెప్పించుకున్నాడు.” అన్నాడు సత్తిబాబు.

ఇంతలో–

“చిత్రగుప్తా ... మొన్నటి దినమున నువ్విచ్చిన రంగు సీసా అయిపోయినది... నాకు మరో రెండు రంగు సీసాలు కావలెను.” అంటూ యముడి భార్య రంగప్రవేశం చేసింది.

“దేవీ!... నువ్వు కూడానా!!... హతవిధీ!!! ఇలాంటి రంగులు మనం వేసుకోకూడదు.”

“ఎందుకు వేసుకోకూడదు?” అంటూ మధ్యలో దూరాడు సత్తిబాబు.

“నువ్వుండవయ్యా! చిత్రగుప్తా! ముందీ పాపిని....”

“హలో....హలో.... నేను పాపిని కాదు! నాకింకా భూమి మీద నూకలుండగానే మీ వాళ్ళు తీసుకొచ్చేసారు.”

“చిత్రగుప్తా ఇతని నోటినుండి మరియొక్క మాట వచ్చినను క్షమించేది లేదు. ఇతనిని త్వరితగతిని భూలోకమునను పంపించి వేయుము.” అంటూ ఆయాస పడ్డాడు యముడు.

“ప్రభూ!...శాంతించండి! అమ్మగారికి... తమరకూ...అలాగే మన లోకములోని వారికి రంగులు కావలసి వచ్చినచో...”

“చిత్రగుప్తా! ఆ రంగుల గోలేదో మనమే పరిష్కరించుకొనెదము. తక్షణమే ఈతనిని పంపించి వేయుదు.”

“ఆఁ... తెచ్చేసుకోండి! ఏ కంపెనీలు పడితే ఆ కంపెనీల రంగులు తెచ్చేసుకుని వేసేసుకోండి. ఉన్న జుట్టు కాస్తా ఊడిపోయి బట్టబుర్రలేసుకుని తిరుగుదురుగానీ... అప్పుడింక ఏ రంగుల గోలా ఉండదు.” అన్నాడు సత్తిబాబు వెటకారంగా.

“ప్రభూ! ఈ మానవున్ని మన పనయ్యేంత వరకూ మన దగ్గరే ఉంచుకుందాం... మనకెలాగూ ఆ రంగులు గురించి తెలీదు కదా!”

“చిత్రగుప్తా!” అంటూ తల పట్టుకుని– “ఓరీ మానవాధమా! ఏమి చేసిన బాగుండునో నువ్వే చెప్పుము.” అన్నాడు యముడు ఇక చేసేది లేక.



“మానవాధమా!... ఏంటీ నాకు మీ గ్రాంథికం అర్థం కాదనుకుంటున్నారా? నేనూ చాలా పౌరాణిక డ్రామాలేసాను.” సత్తిబాబు సీరియస్ అయిపోయాడు.

“హతవిధీ!” అంటూ తలకొట్టుకుని–

“ఓ నరోత్తమా!... నీవే ఏదొక పరిష్కారము సెలవిమ్ము.” అన్నాడు యముడు మర్యాదగా.

“అద్గదీ! అలారా దారికి... చెప్పేదేముంది ఇందాకే చెప్పాను కదా...దెబ్బకు రెండు పిట్టలు.”


“దెబ్బకు రెండు పిట్టలా! అనిననేమి?”

“అదే... మీకు యువకులెవరో... వృద్ధులెవరో భేదం తెలియవలెనన్న... అలాగే మీకు కూడా తలకు వేసుకునే రంగులు కావలెనన్న ఒక్కటే మార్గం. రంగులు తయారు చేయు కంపెనీలకు పోయి తయారైనవి తయారైనట్టు తస్కరించుట మరియు ఆల్రెడీ షాపులలో ఉన్న రంగులు మాయము చేయుట.”

ఇంతలో “ప్రభూ దేవేంద్రులవారు తమ దర్శనమునకు విచ్చేయుచున్నారు” అంటూ వార్తాహరులు వార్త మోసు కొచ్చారు.

‘సందట్లో సడేమియాలా ఈయన ఇప్పుడే రావాలా! ఓహో...ఈ నరాధముడితో మాట్లాడి వీడి జబ్బు నాకు అంటుకొనినట్టుంది’ అనుకుని– “దేవేంద్రులకు స్వాగతం!... ఏమి దేవేంద్రా అకాలముగా ఇలా విచ్చేసిరి?”

“ఏమున్నది యమధర్మరాజా! మీ యమ



లోకపువాసులు... భటులు... స్త్రీలు... అందరూ తలకు ఏవో రంగులు వేసుకొనుచున్నారంట... వయస్సుని జయించుచున్నారట. మా చెల్లెలు మీ చెల్లెలికి ఫోన్ చేసినదట. మీరూ ఉన్నారు ఎందుకు... అంటూ నాపై నిష్ఠూరములు వేయుచున్నది. అందుకే ఇలా!"

దేవేంద్రుని మాటలు విని యముడు చిత్రగుప్తునివైపు సీరియస్ గా చూసి "దేవేంద్రా! ఆ రంగులు గురించి తెల్సిన భూలోకపు వాసి ఇక్కడే మన సభనందే ఉన్నాడు. అతనిని మన భటులకు తోడిచ్చి భూలోకమునకు పంపించి ఆ రంగులు తెప్పించి మీ లోకమునకు పంపించెదను."

"అటులనే యమరాజా!" అని దేవేంద్రుడు నిష్క్రమించాడు.

ఇంతలో భటులలో కలకలం మొదలవడంతో-

"యముండ! ఏమైనది...క్రమశిక్షణ వీడి అలా గోల చేయు చుంటిరేల?"

"ప్రభూ! మాకు కూడా జీతముతో పాటుగా నెలకొక రంగు సీసా ఇచ్చే ఏర్పాటు చేయించండి... అందరి జుట్టూ పండి పోయి పీచులా తయారైపోయింది...బాబ్బాబూ..."

"ఓరీ....ముందు మీ గోలాపి మీ మీ పనులకు పోయెదరా లేక ఈ రంగులతో పనిలేకుండా అందరికీ శిరోముండనం కావించమందురా?" అంటూ పూనకం వచ్చినవాడిలా యముడు ఊగిపోవడంతో భటులు పరుగులు తీసారు.

✦✦✦

ఓ నెలరోజుల తర్వాత....

యముడు సింహాసనాధీశుడై- "చిత్రగుప్తా! ఏమి సమాచారము?" అడిగాడు చిత్రగుప్తున్ని.

"ఏమున్నది ప్రభూ కథ మరలా మొదటికే వచ్చినది" అన్నాడు చిత్రగుప్తుడు నీరసంగా.



"మరలా మొదటికే అనగా?"

"తలకు వేసుకునే ఆ రంగుసీసాలు తయారైనవి తయారైనట్టు మనము మాయం చేయుచున్నాము కదా ప్రభూ!"



"అవును... అయితే!"

"అనేక రకాల రసాయనాలతో, ఎరువులతో పండించిన హైబ్రీడు ఆహార పదార్థాల వలన మరియు విపరీతంగా పెరిగిపోయిన కాలుష్యం వలన వయోభేదం లేకుండా అందరి జుట్టు తెల్లగా అయిపోవడం... దానికితోడు తలకు వేసుకోవడానికి రంగులు దొరకక అందరి జుట్టు తెల్లగానే ఉండటంతో భటులకు యువకులెవరో... వృద్ధులెవరో తెలియక వెనక్కి వచ్చేస్తున్నారు ప్రభూ?"

చిత్రగుప్తుడు మాటలు విని యముడు- అయితే మన తక్షణ కర్తవ్యం అంటూ దీనంగా చూసాడు చిత్రగుప్తునివైపు.


వయసు మీరిన ప్రేమకథ
....మన పెళ్ళికేం తొందర మోహన్! నాకు అన్నివిధాలా నచ్చినవాడు రాడని గ్యారంటీ ఏమిటట!
అదేమిటో మోహన్! నీకోసం ఎదురు చూస్తుంటే నిమిషాలు గంటల్లా ఉంటాయా! నువ్వు వచ్చాక గంటలు నిమిషాలవుతాయి
అదే ప్రేమంటే... ఇప్పుడు పెళ్ళిచేసుకున్నామే అనుకో_ రోజులు యుగాలుగా మారిపోతాయి
నీకు తెలుసుకదా! నేనెంత ఖచ్చితమైన మనిషినో, ప్రేమలోనూ అంతే! సరిగ్గా ఆరుగంటలకు బీచ్‌కి రావల్సిన సుబ్బులు ఏడుగంటలకొచ్చింది. వెంటనే గుడ్‌బై చెప్పేశాను
సుధాకర్ కి అంతే....

నాకు తెలిసిన బాలి గారు...

-పుక్కల్ల రామకృష్ణ, కార్టూనిస్ట్

బాలి గారితో నాది పదకొండేళ్ళ అనుబంధం.

యానిమేషన్‌పట్ల నాకున్న శ్రద్ధాసక్తులు గమనించి జయ దేవ్‌బాబుగారు, 'కలర్ చిప్స్' అనే యానిమేషన్ స్టుడియోలో నాకు శిక్షణ ఇప్పించడమే కాకుండా శిక్షణ అనంతరం అదే స్టుడియోలో ఉద్యోగవకాశం కూడా కల్పించారు.


బాలిగారు ఆ స్టుడియోలో సిండికేషన్ డిపార్ట్‌మెంట్లో చీఫ్ ఆర్టిస్ట్‌గా వుండేవారు. సిండికేట్ విభాగంలో ఆర్టిస్టుల కొరత వుండడం వలన కొంతకాలం సిండికేషన్ విభాగంలో బాలి గారికి శిష్యరికం చేసే మహాదావకాశం కలిగింది.

సిండికేషన్ విభాగంలోబాలిగారు ఫీచర్స్‌కి బొమ్మలు గీయ డమే కాకుండా అప్పుడప్పుడు యానిమేషన్‌కు సంబంధించిన క్యారెక్టర్ డిజైన్స్ కూడా చేసేవారు. నాకు తీరిక సమయం దొరికితే అతను బొమ్మలకు రఫ్ స్కెచ్‌లు పెన్సిల్‌తో గీస్తుంటే, శ్రద్ధగా కళ్ళప్పగించి చూసేవాణ్ని. పెన్సిల్‌తో గీసిన గజిబిజి గీతలు ఇంకింగ్ చేస్తున్నప్పుడు అందమైన బొమ్మలుగా మార టం నాకు బలే అద్భుతంగా తోచేది. అవి చూసి నేను బొమ్మల గీసే పాత పద్ధతులకు తిలోదకాలిచ్చి, బాలిగారి పద్ధతిలో సాధన చేయడానికి అప్పటినుండి అలవాటు పడ్డాను. బాలి గారి పద్ధతిలో నేను గీసిన బొమ్మల ప్రమాణాలు మెరుగు పడటమే కాకుండా గ్రాఫిక్ డిజైనర్‌గా నాకు ఆ పద్ధతి ఎంతో ఉపయోగపడింది.





The art of Bali

రిఫరెన్స్ గా వుంటాయని, అతను స్క్రిబుల్ చేసిన పెన్సిల్ గీతల్ని జెరాక్స్ చేసి కాపీలను వుంచుకునేవాణ్ని. పెన్సిల్ గీతల్ని బ్రష్ (బాలిగారు బ్రష్ ఎక్కువుగా వాడేవారు) తో ఇంకింగ్ చేసి ఆరాక, పెన్సిల్ గీతల్ని తుడిపేసిన బొమ్మల్ని కూడా జెరాక్స్ చేసి వాటిని ఇంకింగ్‌కి పూర్వం పెన్సిల్ గీతల జెరాక్స్ కాపీతో పోల్చి చూసుకుంటే బొమ్మలు గీయడంలో మెళకువలు అర్థమయ్యేవి. పదిలంగా దాచిన అప్పటి చిత్రాలలో ఒక చిత్రాన్ని, హాస్యానందం బాలి ప్రత్యేక సంచికలో ఇలా పంచుకోవడం సంతోషంగా వుంది.



బాలిగారిలో ముక్కు సూటిగా పోయే మనస్తత్వం అతనిలో నాకు నచ్చే అంశాలలో ఒకటి. ఔత్సాహిక కార్టూనిస్టుల కార్టూన్లపై "ఇలా చేస్తే బాగోదు, అలా అయితే బాగుంటుంది" అని నికచ్చిగా తన అభిప్రాయం చెప్పడమే కాకుండా విసుక్కో కుండా చక్కటి గీతలు గీయడానికి అవసరమయ్యే సరంజామా కోసం ఓపికగా వివరించడంలో బాలి గారి పెద్ద మనసు ప్రస్ఫుట మవుతుంది. చేసే పని పట్ల అంకిత భావం ఉంటేనే అద్భుతాలు సృష్టించవచ్చని బాలి గారి పని తీరు పరిశీలిస్తే అర్థ మవుతుంది. బొమ్మలు గీయడం ఎంతో ఉన్నతి సాధించినా, బాలిగారు ఇప్పటికీ వైవిధ్యం కనబరచే చిత్రకారుల గీతాల్ని ఆరాధించడమే కాకుండా వాటిని హృదయంలో పదిల పరచుకుంటారు.





ఈ నెల హాస్యానందం బాలిగారి స్పెషల్‌గా మన ముందు కు వచ్చినందుకు బాలి గారికి అభినందనలు, సంపాదక వర్గానికి ధన్యవాదములు.

గంగాధర్ వడ్లమన్నాటి

ఫన్ పంచ్!



మొగుడ్స్.. పెళ్ళామ్స్.. మధ్యలో నవ్వుల్స్!

రివర్స్ పంచ్

"ఏవండీ, మనింట్లో అద్దెకు ఉంటున్న వాళ్ళు వారం తర్వాత ఖాళీ చేసేస్తారట. కనుక వాళ్ళు నీళ్ళు ఎక్కువ వాడకుండా మన మోటర్ రిపేర్ అయిందని ఓ వారం తర్వాత బాగు చేయిస్తామని తెగేసి చెప్పేయండి. లేదంటే బోలెడు నీళ్ళు, చాలా కరెంటూ వృథా మనకి" చెప్పింది కాంతం

"పాపం! బాధపడతారేమో కాంతం" చెప్పారు సుబ్బారావ్‌గారు.

"బాధా!... పడితే పడనిద్దురూ. ఎలాగూ ఖాళీ చేసేస్తున్నారుగా. అంతగా తప్పకపోతే వాళ్ళాయన్నే నూతి దగ్గర నీళ్ళు తోడతాడో లేక పని మనిషిని పెట్టుకుని నీళ్ళు తోడించుకుంటాడో మనకి అనవసరం అంతే" చెప్పింది కాంతం నిర్లక్ష్యంగా.

"ఏంటో కాంతం!... మనుషుల్లా కాకుండా మానులా ప్రవర్తిస్తున్నావ్." చెప్పాడాయన కాస్తంత అసహనం స్వరంలో.

✦✦✦

వారం గడిచిన తరువాత, కాంతం ఇంట్లో అద్దెకి ఉన్న లలిత ఆమె దగ్గరికి వచ్చి– "ఆంటీ! మేం ఇవాళే ఇల్లు ఖాళీ చేసేస్తున్నాం. ఇదుగోండి స్వీట్లు" చెప్పింది ఉత్సాహంగా.



"ఎందుకూ!" అడిగింది కాంతం ముఖం చిట్లిస్తూ.


"ఎందుకంటే, మీ మోటర్ రిపేర్ పుణ్యమా అని నెలకి డాక్టర్ల ఫీజు, టెస్టులూ, మందులూ, ఫిజియో థెరపీ అంటూ ఆరు, ఏడు వేలు ఖర్చయ్యే మా వారి నడుం నొప్పి, రోజూ నూతి దగ్గర నీళ్ళు తోడడంతో పూర్తిగా పోయింది. పైగా ఓ రోజు నీళ్ళు తోడుతుంటే ఓ పాత నాణెం దొరికిందిట. ఆయన పురావస్తు శాఖ కదా. దానికి లేబ్‌కి తీస్కెళ్ళి పరీక్షిస్తే చాలా, చాలా విలువైనదిగా తేలిందట. అది చాలా అరుదైన నాణెం అట. దాంతో ఆయన్ని మెచ్చి, పై అధికారులు ప్రమోషన్ కూడా ఇవ్వబోతున్నారు. దీనికంతటికీ కారణం మీరేగా. అదే, అదే మీ మోటర్ పాడవడం వల్లనే కదా! అందుకే ఈ స్వీట్లూ, ఫ్రూట్లూ చెప్పి వాటిని ఆమె చేతుల్లో పెట్టి హుషారుగా అక్కడ్నుంచి కదిలింది లలిత.

దాంతో కాంతంలో అసూయ, ద్వేషం రెట్టింపయ్యాయి. పైగా తన ప్లాన్ వాళ్ళ పాలిట ప్లాటినంగా మారినందుకు మరింత రగిలిపోసాగిందామె


అప్పుడే వచ్చి ఆ సంభాషణంతా విన్న శేఖరం– "ఏంటి లలితా! ఆవిడకెందుకు స్వీట్లు, ఫ్రూట్లు. మనల్ని ఎన్ని ఇబ్బందులకి గురి చేసిందని" అని ఓ క్షణం ఆగి "ఔనూ... నువ్వావిడకి నాకు నడుం నొప్పి పోయిందని, ఏదో నాణెం దొరికిందని చెప్పావ్. నాకేం అర్థం కాలేదు" చెప్పాడు బుర్ర గోక్కుంటూ.

